నేటి దినపత్రిక
# సూర్య
బుధవారం
14 ఫిబ్రవరి
2024
పేజీలు 12
ప్రకాశం
బాపట్ల

# బరిలో ఎవరు?!




## కందుకూరు నుంచి పోటీకి పెంచలయ్య యాదవ్ వెనకడుగు

## తెరపైకి బొట్ల రామారావు

## ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలిసి మద్దతు కోరిన బొట్ల రామారావు

## రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో వైకాపా జాబితా ఆలస్యం

## కందుకూరు పట్టణంలో వైకాపా చేరికల కార్యక్రమంలో బొట్ల

## తటస్థ వైఖరిలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



కందుకూరు, మేజర్‌న్యూస్: కందుకూరు వైకాపా నుంచి రాబోయే ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారనే దానిపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ పెంచలయ్య యాదవ్ వైకాపాలో చేరారు. ఆయన పోటీ చేస్తారని భావించారు. ఈక్రమంలో ఆయన నియోజకవర్గంలో పర్యటించి ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో కూడా రాజకీయ భవిష్యత్తుపై చర్చించారు. అయితే తాజాగా వైకాపా జోన్ 5 ఇన్‌చార్జ్ బొట్ల రామారావు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలిశారు. మంగళవారం రామారావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొట్ల రామారావు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో సీఎం జగన్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరు అసెంబ్లీ స్థానాన్ని బీసీలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. కందుకూరు అభ్యర్థిగా పరిశీలనలో తనపేరు ఉందని, తనకు మద్దతు తెలపాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆల్ ది బెస్ట్.. గుడ్‌లక్ అని తెలిపినట్టు బొట్ల రామారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుంటే తాను కూడా వస్తానని చెప్పారని, ఎమ్మెల్యే మద్దతు ఉందని తెలిపారు. అయితే కందుకూరు నియోజకవర్గం నుంచి ఈసారి ఎన్నికల్లో బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని అభ్యర్థిగా నిలపాలని అధిష్టానం ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఇటీవల పెంచలయ్యయాదవ్ పేరును, గత కొన్ని రోజుల కిందట కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ పేరును పరిశీలించారు. ఇందులో బుర్రా కందుకూరు నుంచి పోటీకి ఆసక్తి కనబరచక పోవడంతో బీసీ అభ్యర్థుల కోసం వైకాపా అధిష్టానం వెతుకులాటలో పడింది. ఆ సమయంలో బొట్ల రామారావుతోనూ అధిష్టాన వర్గాలు పలు మార్లు చర్చించాయి. తాజాగా పెంచలయ్య యాదవ్‌ను తీసుకువచ్చినప్పటికీ ఆయన కందుకూరు నుంచి పోటీ చేసే విషయంలో అంతగా ఆసక్తిగా లేరని తెలుస్తుంది. కందుకూరులో ఉన్న ప్రత్యేక పరిస్థితులు నేపథ్యంలో పెంచలయ్య గత అనుభవాల దృష్ట్యా పార్లమెంట్ స్థానంపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తుంది. పెంచలయ్య పోటీకి ఆసక్తి లేరని ప్రచారం జరగడం వెంటనే మిగతా 3లో

### పోలీసుల కక్షపూరిత ధోరణికి

# న్యాయస్థానం చెక్

## హైకోర్టు ఆగ్రహంతో దిగొచ్చిన పోలీసులు

## 41ఏ నోటీసులు అందించిన మార్టూరు పోలీసులు



పర్చూరు, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసులు, కక్షపూరిత ధోరణికి న్యాయస్థానం చెక్ పెట్టింది. వైసీపీ రౌడీ మూక లతో జనవరి 30న మైనింగ్ అధికారులు మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలపై దాడులు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి అక్కడకు చేరుకొని ఎలాంటి అనుమతులు లేకుండా మారణ ఆయుధాలు, కర్రలు, కారం పొట్లాలతో తనిఖీలకు రావడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఎమ్మెల్యే ఏలూరిపై అక్రమ కేసులు బనాయించారు. పలువురు గ్రానైట్ వ్యాపారులు, తెలుగుదేశం పార్టీ నాయకులపై మిగతా 3లో

# అరాచక పాలన అంతం కోసమే 'రా కదలిరా'

## 17న ఇంకొల్లులో అధినేత చంద్రబాబు భారీ సభ

## 14న ఉదయం 9:30 గంటలకు సభా వేదిక వద్ద భూమి పూజ

## మధ్యాహ్నం పార్లమెంట్ కమిటీ సమావేశం

## లక్ష మంది లక్ష్యంగా సభా ఏర్పాట్లు

## సభ స్థలాన్ని పరిశీలించిన పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి



ఇంకొల్లు, మేజర్‌న్యూస్: అరాచక పాలనను సాగనంపేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 'రా కదలిరా' సభతో శంఖారావం పూరించనున్నట్లు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈనెల 17న బాపట్ల పార్లమెంట్ పరిధిలో రా కదలిరా బహిరంగ సభ ఇంకొల్లులో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌తో కలిసి బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి దౌర్జ న్యాలు అరాచకాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎండ కట్టేందుకు ప్రజలను చైతన్యం చేసేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్నారన్నారు. వైసిపి దౌర్జన్యాలు ధమన కాండను ఎదుర్కొంటూ జిల్లాలో తెలుగుదేశం పార్టీ మహాశక్తిగా ఆవిర్భవించిందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ప్రజలకు జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదలిరా పేరుతో అధినేత చంద్రబాబు తారక రామా విజయభేరి ప్రాంగణంలో ఈనెల 17న సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభకు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి లక్షకుపైగా ప్రజల హాజర వుతారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ నిస్మరించి, ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభతో మిగతా 3లో

# రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి పోరాడుదాం

## దళితుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్ సర్కార్

## అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



సంతమాగులూరు, మేజర్‌న్యూస్: కొరిశ పాడు మండలం అనమనమూరు గ్రామం లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 20 కుటుంబాలు సంతమాగులూరు అతిధి గృహంలో మంగళవారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్‌ల సారథ్యంలో రూపొందించిన 11 అంశాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్దా మని, తెదేపా హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని, వైసీపీ అవినీతిని, ప్రజలకు చేసిన మోసాలను ఎండగడదామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ దళిత సోదరుల ఓట్లతో గద్దెనెక్కిన వైకాపా ప్రభుత్వం నేడు దళితులపై దమనకాండ సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగ్జీవనజ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల మిగతా 3లో

## ఎఫ్ ఆర్ టి ఐ క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: ప్రజలకు ఉపయోగ పడేలా చట్టాలు తెలియజేసి ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ పై అవగాహన కల్పిస్తున్న ఫోరమ్ ఫర్ ఆర్టీఐ కృషి అభినందనీయం అని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా పేర్కొన్నారు. ఎఫ్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ కలెక్టరేట్ లో చట్టాలతో రూపొందించ బడిన నూతన సంవత్సర కేలండర్ ను,మెమెంటో ను కలెక్టర్ రంజిత్ భాషా కు అందజేశారు. తమ సంస్థ ప్రజలకు చైతన్యం కలిగేలా ప్రభుత్వ పథకాలు,చట్టాలు, సమస్యల సాధనకు కృషి చేస్తున్న విషయాలను చంద్రమోహన్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిజాయితీగా పనిచేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఈ నెల 18న జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



రేపల్లె, మేజర్‌న్యూస్: నియోజకవర్గ జనసేన పార్టీ నూతన కార్యాలయం ఈ నెల 18 న ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసన సభ్యులు అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారని చెప్పారు. కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా పట్టణంలో వివిధ వార్డుల్లో జనసేన పార్టీ జెండాల ఆవిష్కరణ, ర్యాలీలు, భారీ ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనసేన-టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, వీరమహిళలు, పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ కార్యాలయ గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన-టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కష్టపడి చదవటమే ఇష్టంగా పెట్టుకుంటే భవిష్యత్తులో మంచి ఫలితాలు : కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్:బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలుగు భాష ఉపాధ్యాయుడయ్యారు. వాడరేవు లోని ఒక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశా రు. విద్యా ర్థుల సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదిలో కొద్దిసే పు తెలుగు పాఠం చెప్పారు. మంచి క్రమశిక్షణ అలవ ర్చుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచిం చారు..కష్టపడి చదవటమే ఇష్టంగా పెట్టుకుంటే భవి ష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ బాషా ఉద్బోధించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పూర్తిస్థాయి సౌకర్యాలు లేకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# బాపట్లలో అమ్మకు ఆనందోత్సవ కార్యక్రమం



బాపట్ల, మేజర్‌న్యూస్: భూమి మీద ఉన్న ప్రతి వ్యక్తి జీవితంలో మరచి పోలేని, మర్చిపోకూడని పదం అమ్మ అనే రెండు అక్షరాలు. జీవితాన్ని ఇవ్వాలన్నా, జీవితాన్ని సరైన దిశలో నడపాలన్నా, జీవిత గమ్యాన్ని చేరేందుకు దారి చూపించాలన్నా అమ్మ నాన్నల ప్రాధాన్యత ఎంతో ఉంది. అందులో ప్రధాన భూమిక తల్లి దే అని చెప్పటం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అటువంటి అమ్మకు అక్కున చేర్చుకొని తనయులు పాదాభివందనం చేశారు. ఆమెను సత్కరించారు. అమ్మ మనసులో ఆనందోత్సవాన్ని నింపారు. బాపట్లలో జరిగిన ఈ అద్భుతమైన కార్యక్రమానికి అమ్మకు ఆనందోత్సవం అనే నామకరణం చేశారు. సంస్కారాన్ని అనుబంధాన్ని తెలియజేయాలన్నా, ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చు కోవాలన్నా అమ్మానాన్నలు కావాలి. మన నీడలా మన జీవితాంతం వెన్నంటి ఉండే అద్భుతమైన అనుబంధాలు అమ్మానాన్నలు. బాల్యంలో చందమామ రావే అంటూ ఆకాశమే హద్దుగా అమ్మ చేసే ఉపదేశం.. నాన్న గుండెలపై ఆడుకున్న క్షణాలు మనిషి జీవితం లో చెరగని జ్ఞాపకాలు. మనకు కష్టం వచ్చినా.. బాధవేసినా, కన్నీరు కార్చినా, ఆనందంగా ఉన్నా, తప్పు చేసినా, ఎంతో ఎత్తుకు ఎదిగినా అన్నీ మనం అందరితో పంచుకోలేము. కానీ ప్రతీ సారి మన వెనుక నిలబడి తప్పు చేస్తే దాన్ని సరి చేస్తూ, కష్టం వస్తే తోడుగా ఉన్నామని భరోసా ఇస్తూ, ఆనందంగా ఉంటే వారు ఆనందిస్తూ, కన్నీరు కారిస్తే ఓదారుస్తూ, ఎత్తుకు ఎదిగితే గర్వపడుతూ, మనం పట్టించుకున్నా.. పట్టించుకోకపోయినా మన నీడలా జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకునే అమృత మూర్తులు మన తల్లిదండ్రులు.. తల్లిదండ్రులను ప్రేమించలేని వారు ఎన్ని పూజలు చేసినా వ్యర్థమే. తనయుల పట్ల తల్లి అందించే ఆప్యాయత అనురాగాలను తెలియజేసే బృహత్తరమైన కార్యక్రమానికి బాపట్ల శివాలయం వేదిక అయింది. అమ్మకున్న ప్రాధాన్యతను వివరించడంలో ఎందరో వక్తలు ఇచ్చిన సందేశాలు ఆలోచింప చేశాయి. అమ్మలను ఆ తనయులు ఘనంగా సత్కరించారు. వారికి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. గోపాళం రవి, అలపర్తి శ్రీనివాసరావు, కొటికం సుబ్బారావు, బాబు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ భారత్ బంద్ ను విజయవంతం చేయాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ,కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న కేంద్ర కార్మిక సంఘాలు,రైతు సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె,గ్రామీణ భారత్ బంద్‌ను విజయ వంతం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయం లో జరిగిన విలేఖర్ల సమావేశంలో కార్మిక సంఘాల నాయ కులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనా రాయణ, మర్రివాడ వెంకటరావులు మాట్లాడుతూ కేంద్రం లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను,కార్పొరేట్ సంస్థ లకు కట్టబెడుతు ందని వారు ఆరోపించారు.ఎన్నికల సమయంలో బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ యువతను మోసం చేశారని వారు విమర్శించారు.ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసేందుకు నరేంద్రమోడీ పూనుకున్నారని బాలాజీ, సత్యనారాయణ, వెంకటరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాధన్ కమిటి సిఫార్సులను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాల ని,రైతుల రుణాలు మాఫీ చేయాలి,విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి,కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని,అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని తదితర డిమాం డ్లతో జరుగుతున్న కార్మిక సమ్మె,గ్రామీణ భారత్ బంద్ లో రైతులు, ప్రజలు, కార్మికులు,యువకలు పాల్గొని విజయ వంతం చేయాలని వారు కోరారు.ఈ సమావేశంలో సిఐటి యు, ఎఐటియుసి, ఎ.ఐ.ఎఫ్.టి.యు నాయకులు జి. నాగరాజు, మనోజ్,కొడాలి రామ కోటేశ్వరరావు,దొంతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 28వ సాయిబాబా ప్రతిష్ట వార్షికోత్సవం



బాపట్ల టౌన్,మేజర్‌న్యూస్: 28 ప్రతిష్ట వార్షికోత్సవ సందర్భంగా షిరిడి సాయి బాబా వారి దేవాలయంలో మంగళవారం గుండ్రెడ్డి శివ అనురాధ దంపతుల చే అఖండ దీప స్థాపన మరియు ఆఖండ నామ సప్తాహం (ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ) ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల శ్రీ షిరిడి సాయిబాబా సేవా సమితి సభ్యులు అధ్యక్షులుకె. రాజ్యలక్ష్మి, సెక్రటరీ ఉప్పాల వీరయ్య, బలగాని బాలకృష్ణుడు, ఉడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల గడ్డ దళితుల అడ్డా: డాక్టర్ చార్వాక



బాపట్ల, మేజర్‌న్యూస్: అత్యధిక ఓట్లు కలిగిన ఎస్సి,ఎస్టీ, బిసి, మైనార్టీల తరుపున గత మూడు దశబ్దలుగా పనిచేస్తున్న నేను, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ 1994 న బి ఎస్ పి తరుపున అనేక కార్యక్రమాలు చేపట్టి,బాపట్ల నియోజకవర్గం లోని అన్నివర్గాల ప్రజలకు జరిగే అన్యాయాలకు భాధితుల పక్షాన పోరాటం చేస్తున్నా నని డాక్టర్ చార్వాక పట్టణం లోని అయన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో అన్నారు.బాపట్ల ప్రజలు భిన్న పార్టీలను గెలిపించుకున్న అభివృద్ధి సూన్య మేనని చార్వక అన్నారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో తను కూడా స్వతంత్ర అభ్యర్థి గా పోటీ చేయాలానే ఆలోచన కలిగి వున్నాని బాపట్ల నియోజకవర్గ ప్రజలు తనయొక్క సేవలు గుర్తించాలని “”బాపట్ల గడ్డ దళితుల అడ్డా””అనే నినాదం తో ప్రజల్లో ముందుకు వెళ్తున్న తనను బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వధించాలని మీడియా ముఖంగా కోరారు.ఈ కార్యక్రమం లో మాల మహానాడురాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, మహిళా నాయకురాలు దాసరి లక్ష్మి, మంచాల ఆనంద్ మరియు ప్రసన్న బాబు పాల్గొన్నారు.

## పెదపులివర్రు లో జగనన్న సురక్ష -2 కార్యక్రమం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండలంలోని పెదపులివర్రు గ్రామంలో జగనన్న సురక్ష-2 కార్యక్రమం మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం పీ పీ.దావూరి వెంకటలలితమల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మ గాంధీజీ కలలు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ద్వారా నెరవేరాయని,గ్రామ పరిపాలన సచివాలయాల ద్వారా జరుగుతున్న దని,ఇంటి వద్దకే వైద్య సిబ్బంది ద్వారా ఆరోగ్య సంరక్షణ,గ్రామ,గ్రామాన జరుగు చున్నవన్నారు.ఇంటి వద్దకే పెన్షన్లు వాలంటీర్లు ద్వారా,ఇంటి వద్దకు రైస్ వాహనం ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జేబీవీ మల్లికార్జున రావు,డాక్టర్ రామ లక్ష్మి నీలా రమేష్,గ్రామ సెక్రటరీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కార్యకర్తలు,స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి



బాపట్ల,మేజర్‌న్యూస్:బాపట్ల జిల్లా బాపట్ల లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో బాపట్ల జిల్లా వైసీపి దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య మంగళవారం మాట్లాడుతూ ఎమ్మెల్యే కోన రఘుపతి మీద విమర్శలు చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని ఖబడ్డార్ అని అన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్ల జిల్లా తీసుకువచ్చి సిఎం జగన్ సహకారంతో బాపట్ల లో మెడికల్ కాలేజీని,500 పడకల ఆసుపత్రిని తీసుకువచ్చి, నేషనల్ హైవే రోడ్డు కూడా ఏర్పాటు చేసి బాపట్లను ఎంతో అభివృద్ధి చేసినది కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కి కనబడలేదా అని అన్నారు. అలాగే సిఎం జగన్ మీద విమర్శలు చేస్తున్న షర్మిల 5 కోట్ల ఆంధ్ర ప్రజలను మోసం చేసినది కాంగ్రెస్ పార్టీ కాదా! రాజశేఖరరెడ్డి చనిపోవటానికి కారణం, జగన్ ను అక్రమంగా 16 నెలలు జైలులో ఉంచినది కాంగ్రెస్ పార్టీ కాదా! అలాంటి పార్టీలో మీరుండి కూటమిగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తో కలిసి సిఎం జగన్ మీద విమర్శలు చేయటాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మళ్ళీ 2024 లో సిద్ధం అనే నినాదంతో సిఎంగా జగన్ ను మళ్ళీ కోన రఘుపతి ని మూడోసారి ఎమ్మెల్యే గా గెలిపించుకుంటామని చల్లా రామయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ సుభాని, టి. వెంకటేశ్వరరావు, కాగిత రవి, ఆకురాతి విష్ణుమూర్తి, కృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

# సాంకేతిక విద్య జీవనోపాధిని కల్పిస్తుంది



## జిల్లా ఉపాధి కల్పన అధికారి టి.భరద్వాజ

కొత్తపట్నం, మేజర్‌న్యూస్ : టెక్నికల్ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు జీవనోపాధిని కల్పిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి టి భరద్వాజ అన్నారు. మంగళవారం కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై నిర్వహించిన అవగాహన కు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయు రాలు ఎం. శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలలో ఉండాలంటే సాంకేతిక విద్య సంబంధించిన కోర్సులు పట్ల దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి తర్వాత ఐటిఐ పాలిటెక్నిక్ వంటి టెక్నికల్ కోర్సులు చేయాలని సూచించారు. వృత్తి విద్య కోర్సులు పట్ల జీవన నైపుణ్యత మెరుగు పడుతుందన్నారు. ప్రభుత్వము ఇచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీదేవి మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ కోర్సు చేయాలన్నా పదవ తరగతి ఉత్తీర్ణత ప్రామాణికంగా ఉంటుందన్నారు.

ఈ నెల రోజులు విద్యార్థులు కష్టపడి మంచి మార్కులు తెచ్చుకుంటే ఉన్నత చదువులు చదవడానికి అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలకు వచ్చే అధికారులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక సంఘర్షణకు గురి కాకూడదని , దాన్ని అధిగ మించినప్పుడే మంచి ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ హరిబాబు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు జిలాని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీవి సాగర్ సహకారంలో బాలిక హోంకు తరలింపు

ఒంగోలు, మేజర్‌న్యూస్: మండుటెండలో భిక్షాటన చేస్తున్న బాలికను హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీ.వి సాగర్ సహకారంలో హోంకు తరలించారు. వివరాల్లోకి వెళితే మంగ ళవారం మిట్టమధ్యాహ్నం 12గంటల సమయం లో మండుటెండలో ఒంగోలు మంగమూరు రోడ్ జంక్షన్‌లోని వెన్స్ ప్రక్కన ఉన్న బార్ వద్దకి వద్దకు తిరుగుతూ దయనీయంగా భిక్షాటన చేస్తున నాలుగు సంవత్సరాల బాలికను అటుగా వెళు తున్న హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్ బాలిక పరిస్థితిని గమనించారు. బాలిక వద్దకు వెళ్లి బాలిక వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా ఆ బాలిక దగ్గరలో అల్లూరి స్వీట్స్ షాప్ దగ్గర ఉన్న ఓ మహిళ వద్దకు తీసుకెళ్లింది. చిన్న బాబు ఒడిలో పెట్టుకొని భిక్షాటన చేస్తున్న ఆమెను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో అను మానం వచ్చిన సాగర్ ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు భక్తులకు పద్మావతి



దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ సూచినతో సకాలంలో స్పందించిన సంబంధిత సిబ్బంది బాలికను జిల్లా బాలల సంక్షేమ కమిటీ అదేశాల మేరకు ఒంగోలు బాల సదన్‌లో చేర్పించారు. వైన్ షాపుల వద్ద భిక్షాటన చేస్తున్న బాలికపై ఎవ్వరైనా తాగుబోతులు అఘాయి త్యానికి పాల్పడే అవకాశాలు ఎక్కువ ఉంటాయని, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు బీవి సాగర్ తెలియజేశారు.

## నీలం నాగేంద్రకు కృతజ్ఞతలు తెలిపిన కోడికత్తి శీను

ఒంగోలు, మేజర్‌న్యూస్ :ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జనిపల్లి శ్రీను అలియాస్ కోడి కత్తి శ్రీను దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కోడి కత్తిశీను నీలం నాగేంద్రకు ఫోన్ చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో కోడికత్తి శీను 5 సంవత్సరాల 3 నెలలు జైల్లో గడిపారు. ఎన్ఐఏ కోర్టు శ్రీనుకు బెయిల్ ఇచ్చేందుకు అనేక సార్లు నిరాకరించింది. ఈ కేసులో శీను నేరం చేయలేదని, ఒకవేళ బానే ఈ నేరం చేశానని శీను అంగీకరిస్తే, కేసు నమోదు కాబడిన సెక్షన్ల ప్రకారం రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం శిక్ష పడే అవకాశం లేదు. రెండు సంవత్సరాల శిక్ష కాలం కూడా లేని కేసులో శ్రీను ఐదు సంవత్సరాల మూడు నెలల జైల్లో ఉండటాన్ని, శీను తల్లి దండ్రులు కోర్టులో సవాలు చేశారు. మొదట సలీం, తదనంతరం పిచ్చుక శ్రీనివాస్ అనే న్యాయవాదులు శ్రీనుకు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టులో జాప్యం జరుగుతుండడంతో, ఈ రాష్ట్రంలో మొదటగా స్పందించిన దళితుడు నీలం నాగేంద్రరావు. శీను తల్లికి నాగేంద్ర 50 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. విజయవాడలో జగన్ కోర్టుకు రావాలి అనే డిమాండ్తో మొట్టమొదట రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు పరిణామాలు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా దళితులు స్పందించారు. కోడి కత్తి శీనుకు మద్దతుగా ఎక్కడికక్కడ ఆందోళనలు చేశారు. శ్రీను తల్లితోపాటు శ్రీను కూడా నిరాహార దీక్షకు కూర్చున్నారు. హైకోర్టు శ్రీనుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పై విడుదలైన శీను సొంత ఇంటికి చేరుకున్నారు. దీంతో శ్రీను నాగేంద్రకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర శ్రీనుతో మాట్లాడుతూ, కోర్టు విధించిన షరతులను తొలగించేందుకు కూడా న్యాయపోరాటం చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌లో ప్రాణభయం ఉన్న ఎస్సీ ఎస్టీలకు గన్మేన్‌ను కేటాయించే సౌకర్యం ఉందని, గన్మేన్‌ను నియమించుకోవాలని కోరారు. రిమాండ్ కాలంలో డిగ్రీ పూర్తి చేసినందుకు నాగేంద్ర శ్రీనుని అభినందించారు.

## 19న కనిగిరిలో వైసీపీ పరిచయ వేదిక: హాజరుకానున్న బాలినేని

కనిగిరి, మేజర్‌న్యూస్: ఈనెల 19న కనిగిరిలో వైసీపీ పరిచయ వేదిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి హాజరుకానున్నారు. కనిగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా దద్దాల నారాయణ యాదవ్ కు అయిందని అందులో ఎటువంటి సందేశం లేదని ఇన్చార్జిల మార్పులో ఎటువంటి అపోహలు లేవన్నారు. 19న జరిగే నియోజకవర్గ స్థాయి పరిచయ వేదిక కార్యక్రమంలో నియోజవర్గంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : స్థానిక డిఎస్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని సరోజినీ నాయుడు 145వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.కళ్యాణి హాజరై మాట్లాడారు. సరోజినీ నాయుడు దేశ స్వతంత్రంలో ఏ విధంగా పాలుపంచుకున్నారో అన్ని విషయాల్ని కూలంకుచంగా వివరించారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు పి. ఇందిరా మాట్లాడుతూ మహిళల సాధికారత, మహిళల హక్కుల కోసం సరోజినీ నాయుడు ఏ విధంగా శ్రమించారు. ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ అధిపతి అయిన ఎం.సుధారాణి మాట్లాడుతూ ఆమె సాంస్కృతిక విభాగంలో సరోజినీ నాయుడు, ఏవిధంగా కృషిచేసి మహిళలను అభివృద్ధి ప్రదంలోకి తీసుకెళ్లారు వివరించారు. ఐక్యసి కో ఆర్డినేటర్ పి. కుసుమకుమారి మాట్లాడుతూ మొట్టమొదటి ఉత్తర ప్రదేశ్ గవర్నర్గా సరోజినీ నాయుడు, ఏ విధంగా పని చేశారో వివరించి మహిళలు ఏ విధంగా ఉన్నత స్థితికి వెళ్లాలి అనే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏవి రాజ్యలక్ష్మి, సరళ కేజియా ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర, విద్యార్థినిలు అధిక సంకలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## నేడు ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్ : చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రంలోని ఒంగోలు జాతి పశువుల వేలంపాట బుధవారం నిర్వహిస్తున్నట్లు క్షేత్ర డిడి రవికుమార్ మంగళవారం తెలిపారు. పాడిఆవులు 9, ఒట్టి ఆవులు 19, పెయ్యదూడలు8, కోడె దూడలు6, వేలం నిర్వహించడం జరుగు తుందన్నారు.

ఈనెల 13న పశుక్షేత్రంలోని వేలంపాట నిర్వహించే ఒంగోలు జాతి పశువులను పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా 5,000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## అరాచక పాలన అంతం కోసమే 'రా కదలిరా'



**మొదటి పేజీ తరువాయి** వైసిపి ప్రభుత్వ పతనానికి నాంది పలకాలని తెలిపారు.

**ఇంకొల్లులో భారీ ఏర్పాట్లు**

తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్ రథసారథి ఎమ్మెల్యే ఏలూరి సారథ్యం లో జరుగుతున్న ఈ భారీ బహిరంగ సభకు లక్ష మంది లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకొల్లులోని పావులూరు రోడ్డులో టిటిడి కల్యాణ మండపం సమీపంలో 25 ఎకరాలలో ఈ సభ నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 9:30 గంటలకు సభా ప్రాంగణం సమీపంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సభా ప్రాంగణం, హెలీప్యాడ్, కోసం భూమిని చదును చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు నియోజకవర్గ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

**11:30 గంటలకు పార్లమెంట్ కమిటీ సమావేశం**

రా కదలిరా బహిరంగ సభ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు.

## పోలీసుల కక్షపూరిత ధోరణికి న్యాయస్థానం చెక్

**మొదటి పేజీ తరువాయి** కేసులు బనాయించి అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 5న హైకోర్టు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేసి ప్రజాప్రతినిధులే పోలీసులకు భయపడాల్సి వస్తుందని నిబంధన ప్రకారం నడుచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలు ఆగ్రహంతో మార్టూరు పోలీసులు దిగొచ్చారు. ఏలూరి క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు మార్టూరు పోలీసులు 41ఏ నోటీసులు అందజేశారు. ఈనెల 22న పోలీస్ స్టేషన్‌లో ఇన్వెస్టిగేషన్ అధికారి వద్ద హాజరుకావాలని నోటీసులు అందజేశారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి పోరాడుదాం

**మొదటి పేజీ తరువాయి** విద్యుత్ వినియోగం వరకు ఉచితమని నాడు ప్రతిపక్షంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కొందరికేనంటూ ఎడాపెడా ఛార్జీల భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. గత తెదేపా హయాంలో అమలు చేసిన దళితుల 27 పథకాలు రద్దు చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక అమలవుతున్న అనేక పథకాలను రద్దు చేసిన ప్రభుత్వం వైకాపా అని తెలిపారు. తెదేపా హయాం లో అంబేడ్కర్ విదేశీ విద్య పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులను విదేశాలు పంపి చదివించడం జరిగిందని గుర్తు చేశారు. జగన్ రెడ్డి అంబేద్కర్ పేరు తీసివేసి జగనన్న విదేశీ విద్య పేరు పెట్టడం, ఆ మహానుభావుడిని తక్కువ చేయడమే అన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల న్నింటినీ తుంగలో తొక్కారన్నారు. రానున్నది తెదేపా -జనసేన ప్రభుత్వమని అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు.

## బరిలో ఎవరు?!

**మొదటి పేజీ తరువాయి** బొట్ల రామారావు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలవడంపై వైకాపా ఎవరిని బరిలో దించుతుందో అని చర్చ మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా అధిష్టానం పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించాల్సి ఉండగా రాజ్యసభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సమాచారం. రాజ్యసభ ఎన్నికలు ఉన్న సమయంలో నిర్ణయాలు తీసుకుంటే వాటి ప్రభావం ఎన్నికలపై పడే అవకాశాలు ఉండటంతో వైకాపా 7వ జాబితాను ఆలస్యం చేస్తుందని తెలుస్తుంది. రాజ్యసభ నామినేషన్లలో టిడిపి పాల్గొనకుంటే వైకాపా అభ్యర్థులకు రాజ్యసభ ఎన్నిక సులభతరంగా మారే అవకాశాలు ఉన్నాయి. దీంతో మిగిలిన నియోజకవర్గాలతో పాటు కందుకూరుపై కూడా ఈనెల 15 తరువాత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఒక వేళ టిడిపి రాజ్యసభ పోటీలో ఉంటే వైకాపా ఇన్‌చార్జ్ జాబితా ప్రకటన నెలాఖరుకు మారే అవకాశాలు ఉన్నాయి. కందుకూరు స్థానాన్ని బీసీలకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తటస్థ వైఖరినే అవలంభిస్తున్నారు. దీంతో వైకాపా అధిష్టానం కందుకూరు సీటును బీసీలకు కేటాయిస్తుందా లేక ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డినే మరోసారి బరిలో దించుతుందా అనే సందిగ్ధత మరికొన్ని రోజులు కొనసాగనుంది.

**కందుకూరులో వైకాపా చేరికల కార్యక్రమంలో బొట్ల**

పట్టణంలోని కోవూరు రోడ్డులో బిజెపి నాయకులు పివి రమేష్‌యాదవ్ గృహంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో బొట్ల రామారావు పాల్గొన్నారు. రమేష్‌యాదవ్‌కు వైకాపా కండువాకప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. అంతకముందు రామారావు అంకమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి కందుకూరు నియోజకవర్గ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పట్టిన శనిని వదిలిచేందుకు ప్రజలు సిద్ధం

## దామచర్ల, నూకసానిని కలసిన గరికపాటి





దర్శి, మేజర్‌న్యూస్: జగన్ అర్జునుడు, అభిమాన్యుడు కాదు బస్మాసురుడు అని అయినొక ఆర్థిక తీవ్ర వాది అని దర్శి జనసేన నాయకులు గరికపాటి వెంకట్ అన్నారు. ఒంగోలు టిడిపి నేత లను గరికపాటి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నే పనికి మాలిన ముఖ్యమంత్రి జగన్ అని రాష్ట్ర ప్రజలు సంక్షేమ, అభివృద్ధి అనేది లేకుండా చేసారని అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వ్యవస్థ లన్నిటిని భ్రష్టు పట్టించారాని అన్నారు. ప్రజలపై ఇష్ట రీతిలో పన్నులు వేస్తూ నడ్డి విరిచారాని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు. టిడిపి, జనసేన పార్టీలు కలయుకతో వైకాపా యంపి, ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజీని దర్శి జనసేన నాయకులు గరికపాటి వెంకట్ మర్యాద పూర్వకంగా కలిశారు. దర్శి నియోజకవర్గం సంబంధించి ఎన్నికలలో ఏవిధంగా ముందుకు వెళ్ళాలి అనే విషయం పై చర్చించినట్లు సమాచారం. భవిష్యత్తు గ్యారంటీ ఇస్తూ టీడీపీ, జనసేన పథకాలు, ప్రతి నియోజకవర్గం నకు 25వేల ప్రత్యేక్ష ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా జనసేన షణ్ముఖ ఊహ్యం, పథకాలకు సంబంధించిన బ్రోచర్ దామచర్ల జనార్దన్ ఆవిష్కరణ చేశారు. అనంతరం దామచర్ల జనార్దన్, నూకసాని బాలాజీలను గరికపాటి వెంకట్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మాల పేరంటాల పెళ్లి నలుగు పాటల పోటీలు



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 126వ జయంతి సందర్భంగా అంబేద్కర్ భవనంలో మంగళవారం మాల పేరంటాల పెళ్లి నలుగు పాటల పోటీలు నిర్వహించారు. మాల మహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ పోటీలలో 14 టీములు పాల్గొన్నాయి.ఆరు టీంలు న్యాయ నిర్ణీతలు ఆరు టీములకు సమానంగ అందజేశారు.పాల్గొన్న ప్రతి టీంకు ప్రోత్సాహకంగా 1500 రూపాయలు అందజేశారు. పాల్గొన్న టీములు గణపవరం, ప్యార్లీ పాడు, మూలపాలెం, చింతవారిపాలెం, నరసాయపాలెం, హైదర్ పేట, వీరు విశిష్ట ప్రతిభ కనబరిచారు. మాల మహాసభ వ్యవస్థాపకులు,పీపుల్స్ రిపబ్లీకన్ పార్టీ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, ఈ కార్యక్రమంలో న్యాయం నిర్ణయతలుగా జి. లజపతి రాయ్, ఎంద్రపాటి అశోక్, నక్క భాను, దగ్గు మల్లి కిరణ్ కుమార్, అడే బుజ్జి, గొర్రుముచ్చు వందనం, చల్లపల్లి కోటేశ్వరరావు, ఎర్ర కోటయ్య, గుదే రాజారావు తదితరులు పాల్గొన్నారు. బహుమతులు మొత్తాన్ని ఎం కె ఎం సొసైటీ వారు అందజేశారు.

## రానున్న ప్రభుత్వం టిడిపి జనసేన సంయుక్త ప్రభుత్వం



రేపల్లె, మేజర్‌న్యూస్: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం జనసేన విజయదుందభి మోగించి అధికారం చేబట్టబోతున్నామని రేపల్లె మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు అన్నారు. మంగళవారం పోటుమేరక పంచాయితీ లో బాబు షూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రాని అభివృద్ధి చేయడం కోసం చంద్రబాబు బాబు నాయుడు పడుతున్న ప్రయాసను ప్రతిఒక్కరు గమనించాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని ఏదో చెప్పుకోలేక పోతున్నామని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి అబద్ధపు వాగ్దానాలు చేసి అధికారులు చేపట్టి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పంతాన్ని మురళీదరరావు, సర్పంచ్ లక్ష్మోజి, రేపల్లె సురేష్,సాయి టిడిపి జనసేన కార్యకర్తలు నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## జంకె వెంకట్ రెడ్డికి అభినందనల వెల్లువ



మార్కాపురం, మేజర్‌న్యూస్: జిల్లా వైకాపా అధ్యక్షులు, మార్కాపురం మాజీ శాసనసభ్యులు వెంకీ వెంకట్ రెడ్డికి సోమవారం ఏపీఐఐసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించటం పట్ల వైకాపా శ్రేణుల్లో, జంకె వెంకటరెడ్డి అభిమానులు ఆనందోత్సవంతో ఉన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం మాజీ జడ్పిటిసి జవాజి రంగారెడ్డి, తర్లపాడు మండలం మాజీ జడ్పిటిసి గాయం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, దొంత గౌడ్, బట్టగిరి తిరుపతిరెడ్డి, జంకె అభిమానులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి జంకె వెంకటరెడ్డికి అభినందనలు తెలిపారు.

## ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయండి




బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం శృంగారపురం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ, బికేఎంయు, సిపిఐ పార్టీ అనుబంధ సంఘాలు నిర్వహించిన పత్రిక సమావేశంలో ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తుంది. వ్యవసాయం, పరిశ్రమలు గనులు విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు,ఎలసి తదితర సంస్థలన్నిటిని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్ప చూస్తుంది. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లు తెచ్చింది. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన మరొక రూపంలోవాటిని అమలుపరచచూస్తుంది. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టింది. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం సామాన్య ప్రజల నిత్యవసర వస్తువులన్నింటిపైన జిఎస్టి పేరుతో పన్నులు పెంచింది. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించాలని, పరిశ్రమల అన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని నిర్ణయించాయి. అని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా,సాంస్కృతిక సంఘాలు గ్రామీణ బందు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్డి భాగ్య శ్రీధర్, సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ బాపట్ల పాయింట్ మేస్త్రి తాత ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లేగదూడల ప్రదర్శన కార్యక్రమము



నిజాంపట్నం, మేజర్ న్యూస్ : పాడి పరిశ్రమల సంరక్షణకు రైతులు శ్రద్ధ చూపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతురావు రైతులకు సూచించారు. మండలంలోని కూచనపూడి పశు వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ దూడలకు వాటి పోషణ సరిగా లేకపోవడం వలన అనేక రోగాలతో మృతి చెందుతున్న యని అన్నారు. అందువల్లే పాడి పరిశ్రమలు తగ్గిపోతున్నాయని చెప్పారు. అందుచేత దూడలకు రోజుకి సరిపడా పాలును ఇవ్వాలన్నారు. నెల రోజులలో ఒక్కసారి పురుగు మందులు వేయాలని ఆయన తెలియజేశారు. పాడి పరిశ్రమకు ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. పశుగ్రాసం మరియు విత్తనాలపై సబ్సిడీ ఇస్తుందని వైయస్సార్ పశు బీమా పథకం ఇన్సూరెన్స్ వలన మూడు సంవత్సరాల లోపు మీ గేదలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. గాలి కుంటి వ్యాధులు వలన పశువులు మరణిస్తున్నాయని వీటికి దేశంలో రెండు వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతుందన్నారు. అందుచేత రైతులు పశువులను వ్యాధుల బారి నుండి కాపాడుకుంటే మంచి ఫలితాలు వస్తాయని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా లేగదూడల ప్రదర్శనలో అందమైన మరియు ఆరోగ్య వంతమైనదూడలకు ఒకటి ,రెండు ,మూడు, బహుమతులు రైతులకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో డిడి కేదారేశ్వర రావు(తెనాలి), ఏడి నరేంద్రబాబు, ఏడి నాగేశ్వరరావు (నగరం) స్థానిక, సర్పంచ్ రాజేశ్వరి రామారావు, డాక్టర్లు ప్రవీణ్ కుమార్ (తుమ్మల), హేమ ప్రియ (కూచినపూడి), మీనాక్షి (బొబ్బర్లంక), రంజి తా(భట్టిప్రోలు), రోషన్ బేగ్ (గుత్తా వారి పాలెం), నాయ కులు పిచ్చయ్య, ఎల్లయ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



కనిగిరి, మేజర్‌న్యూస్: స్థానిక వైకాపా కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గానికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను వైసీపి ఇంచార్జి దద్దాల నారాయణ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కృష్ణమాచారి రూ.70 వేలు, మూలే కోటయ్య రూ.1,20,000, సగిటి ఈశ్వరమ్మ రూ.1,20,000 వంతున సీఎం సహాయనిధి క్రింద చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఇన్చార్జి దద్దాల నారాయణ మాట్లాడుతూ పేదవాడికి మెరుగైన విద్య, వైద్యం అందించడంలో వైసీపి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. ఆరోగ్యశ్రీ 25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 2024వ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బ్రహ్మరథం పడతారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, పీసీపల్లి ఎంపీపీ జఫన్యా, ఓకే రెడ్డి, బోర్రా రెడ్డి, కల్వకుర్తి చంద్ర, మండాది కృష్ణారెడ్డి, దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, పోతు రమణారెడ్డి, కనిగిరి నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, ములే గోపాల్ రెడ్డి, కటికల వెంకటరత్నం, కమతం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

- మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



కనిగిరి, మేజర్‌న్యూస్: రానున్న వేసవిలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి పట్టణంలోని ఐదవ వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తల్లెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజలు తమ అవసరాలు నిమిత్తం నీటినీ కొనుగోలు చేయకుండా నీటి సరఫరాకు శాశ్విత పరిష్కారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో చెత్తా చెదారాలు తీసివేసి వార్డును శుభ్ర పరిస్తే ప్రజలకు ఆరోగ్య సమస్యలు లేకుండా దోమలు భారీనా పడకుండా ఆరోగ్య వంతులుగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేవరాజు, మున్సిపల్ ఏఈ కోటేశ్వర రావు, వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫ్ ఉద్దీన్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుమారుని పెళ్లి వేడుకలలో గాదె



కర్లపాలెం,మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం గణపవరంకు చెందిన మాజీ సర్పంచ్ కత్తి డానియల్ కుమారుడు కత్తి వరప్రసాద్ వివాహ వేడుకలలో బాపట్ల నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు గాదె మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అల్లం గోపికృష్ణ, పఠాన్ అజీమ్ ఖాన్, సుధాకర్, మారుబోయిన శ్రీనివాసరెడ్డి,రాంబాబు రెడ్డి (అగ్గిరాముడు) తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన కమలా విద్యార్థినీ ఆల్మాస్ భాను



మార్కాపురం రూరల్, మేజర్ న్యూస్: ప్రభుత్వం ప్రకటించిన గత నెలలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో స్థానిక కమలా జూనియర్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ షేక్ అల్మాస్ భాను 90.65 పర్సంటైల్ సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలాశాల ప్రిన్సిపాల్ దేసు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో శిక్షణ పొందుతున్న 45 మంది విద్యార్థులలో 31 మంది అర్హత సాధించారని, 4 గురు విద్యార్థులు 75 పర్సంటైల్‌కు పైగా సాధించారని ఇంటర్ విద్యతోపాటు జేఈఈ, నీట్ జాతీయ పోటీ పరీక్షలకు శిక్షణను మొదటి నుంచే బేసిక్స్‌ను నేర్పించటం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్ నివారణపై విద్యార్థులకు అవగాహన



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఫ్లోరోసిస్ రాకుండా విద్యార్థులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఫ్లోరోసిస్ నివారణ జిల్లాఅధికారి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సిఎస్ పురం పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, స్థానిక యస్టి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు గ్రామాలలో తాగునీటిలో ఫ్లోరోసిస్ విషయంలో ప్రజలకు వివరించి ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడకుండా ఉండేలా తెలియజేయాలని అదేవిధంగా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించి ఫ్లోరోసిస్ నివారణ ప్రతిఒక్కరి భాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మురళి, కెజిబివి సిబ్బంది, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా హక్కులపై అవగాహన



చీమకుర్తి, మేజర్‌న్యూస్: మహిళల అభివృద్ధిలో భారతీయ సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా సరోజని నాయుడు పోషించిన కీలక పాత్రకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న ఆమె జన్మదినాన్ని జాతీయ మహిళా దినంగా 2014లో ప్రకటించింది అని పార స్వచ్ఛంద సంస్థ ప్రకాశం జిల్లా కోఆర్డినేటర్ నిమ్మరాజు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మంగళ వారం నాడు చీమకుర్తి మండలంలో బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా దినం సందర్భంగా బాల బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ సరోజని నాయుడు పితృ సామ్యం ఉన్న రోజుల్లోనే మహిళ సాధికారత కోసం కృషి చేశారు. ఇప్పుడు అందరూ మాట్లాడుతున్న లింగ సమానత్వం కోసం అపుడే బీజం వేశారు అని తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వలె అదే సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. అదే స్వేచ్ఛలు, హక్కుల కోసం కృషి చేస్తుంది. ఈ కార్యక్రమంలో పార టీమ్ మెంబర్ అనురాధ, గైడ్ టీచర్ గంగాధర్, బాల బాలికలు హాజరు అయ్యారు.

# టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు మేలు: దివి రాంబాబు



చెరుకుపల్లి, మేజర్ న్యూస్: సూపర్ సిక్స్ పథకాలు తో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు అన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో మూడో రోజు మండలంలోని కనగాల, చెరుకుపల్లి టౌన్ లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం మండల తెలుగుదేశం పార్టీ నాయ కులు, జనసేన పార్టీ నాయకులు కలిసి నిర్వహించారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి మేనిఫెస్టో లోని పథకాలు తో రాష్ట్ర ప్రజల ఆర్థికంగా బలోపేతం అవటానికి ఉపయోగపడతాయని ఆయన అన్నా రు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెప్పుకునే నవరత్నాలు పథకాలు అంతా బూటకం, మోసం కొంతమందికి పథకాలు ఇచ్చి మేము పూర్తిగా మేనిఫెస్టో అమలు చేశామని సీఎం డబ్బా కొట్టుకుంటు న్నారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, చెరుకుపల్లి టౌన్ టిడిపి అధ్యక్షులు నాగుల పున్నారావు, రేపల్లె పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, క్లస్టర్ ఇంచార్జిలు ఎం ఆర్ కే మూర్తి, ఉయ్యూరు శివకృష్ణ, నాగుల నరేంద్ర, పి శ్రీనివాస్ రెడ్డి, మండవ తాతాజీ, అక్కల రామసుబ్బారెడ్డి, అలా రామకృష్ణ యాదవ్, అయోధ్యుల చిన్ని ప్రసాద్, రాము, దివి శ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వర రావు, విన్నకోటి రామారావు, లచ్చి రామా రావు, సొంటి కోటయ్య, బెల్లంకొండ శ్రీను, సొంటి సుబ్బయ్య, విస్సంశెట్టి శ్రీనివాసరావు, నాగుల రామకృష్ణ, కాటూరి శ్రీహరి, మేక ప్రసాద్, లచ్చి వెంకటేష్, తాత సీతయ్య, దుర్గారెడ్డి, ఈఊరి దుర్గాప్రసాద్, బి సుబ్బారావు, కృష్ణారావు, ఏనుగులు కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీ పవన్ కళ్యాణ్, గులకారం పవన్, అన్నపరెడ్డి సాంబశివరావు, లక్కింశెట్టి గోపి, తురుమెళ్ళ పవన్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై జీవో విడుదల చేయాలి




కనిగిరి, మేజర్‌న్యూస్: ప్రభుత్వం ఇటీవల మున్సిపల్ కార్మికుల సమ్మె విరమించే క్రమంలో కార్మికులకు ఇచ్చిన హామీలపై వెంటనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కనిగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ నాసర్ వలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 15 డిమాండ్లను ఒప్పుకున్న ప్రభుత్వం రెండు నెలలు గడిచిన జీవోలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రివర్గ సభ్యులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను అప్కాస్ నందు నమోదు చేసి జీతాలు చెల్లించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వేసిన కమిటీ ప్రకారం స్కిల్డ్, సెమిస్కిల్డ్, హై స్కిల్డ్ విభజించి కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. ఎల్ఈడి విధ్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ హామీ ఇచ్చిన డిమాండ్లకు జీవోలు ఇవ్వాలని నినాదాలు చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం కమీషనర్ డానియల్ జోసెఫ్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అద్యక్ష కార్యదర్శులు ఆలూరి కోటయ్య, అశోక్, గంగవరపు కిరణ్, సుబ్రమణ్యం, సాల్మన్, రవి, మధు, ఐజక్, శేషయ్య, సుధాకర్, సూరిబాబు, జీవన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో నగదు బహుమతులు సాధించిన విద్యార్థులు



ఒంగోలు, మేజర్‌న్యూస్: హైదరాబాద్ స్పెక్టర్ అకాడమీ వారు ప్రతియేటా రెండు తెలుగు రాష్ట్రాలలో నిర్వహించే ఇండియాస్ ఫస్ట్ సైన్స్ ఒలంపియాడ్ ఎగ్జామ్ నందు మాంటిసోరి విద్యార్థులు ప్రతిభ కనబరిచి నగదు బహుమతులు కైవసం చేసుకున్నారు. మాంటిసోరి పాఠశాల విద్యా విధానం, శాస్త్రీయ కోణంలో, సృజనాత్మకతో సొంతగా ఆలోచింపజేసేలా ఉండడం వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల కరస్పాండెంట్ శబరినాథ్ తెలిపారు. ఒకటవ తరగతి చదువుతున్న శివ సుందర్ కుమార్ ద్వితీయ బహుమతి సాధించి 1500 రూపాయల నగదు, మూడవ తరగతి చదువుతున్న పార్టీ ద్వితీయ బహుమతి సాధించి 1500 రూపాయల నగదు, ఎం.శ్రీహర్ష తృతీయ బహుమతి సాధించి వెయ్యి రూపాయల నగదు, నాలుగవ తరగతి చదువుతున్న ఎన్.సాకేత్ ద్వితీయ బహుమతి సాధించి 1500 రూపాయల నగదు, ఐదవ తరగతి చదువుతున్న వి.ముఖేష్ తృతీయ బహుమతి సాధించి 1000 రూపాయల నగదు, ఏడవ తరగతి చదువుతున్న శ్రీనివాస్ గౌతమ్ తృతీయ బహుమతి సాధించి 3125 రూపాయల నగదు, ఎనిమిదవ తరగతి చదువుతున్న రోషన్ ద్వితీయ బహుమతి సాధించి 4685 రూపాయల నగదు సాధించారు. ఆరవ తరగతి చదువుతున్న ప్రిన్స్ బ్రైట్, ఏడవ తరగతి చదువుతున్న చరణ్, ఎనిమిదో తరగతి చదువుతున్నది దియశ్రీ, తాప్సీ, 9వ తరగతి చదువుతున్న జయంత్ వర్మ, కార్తికేయ హైదరాబాదులో జరిగిన ఫైనల్స్ రౌండ్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నూరుద్దీన్ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శబరినాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దిన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ బాబు అభినందించారు.

## దగ్గుమల్లి వారి పాలెం మహాజనసభ

బాపట్ల,మేజర్‌న్యూస్:దగ్గుమల్లి వారి పాలెం ఆది ఆంధ్ర కో-ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ నెంబర్ 547 యొక్క మహాజన సభను ది 29- 2-24న సాయంత్రం నాలుగు గంటలకు క్రిస్టియన్ భవన్ మరియు దళిత కమ్యూనిటీ హాల్ నందు జరుపుటకు పాలకవర్గము వారు తీర్మానించి ఉన్నారు. కావున సంఘ సభ్యులు అందరూ హాజరు కావాల్సిందిగా కోరుచున్నాను. పాలకవర్గ అనుమతితో గుండాల విజయ డేవిడ్ రాజు, ప్రెసిడెంట్ ,ఏ ఏ సి సి ఎఫ్ ఎస్ .

## ఘనంగా శివ స్వాములకు చద్ది కార్యక్రమం



కర్లపాలెం,మేజర్‌న్యూస్: కర్లపాలెం అగ్రహారం లోని శ్రీ గంగా గౌరీ సమేత బదరి కేదారేశ్వరస్వామి శివాలయం లో మాల ధరించిన స్వాములకు అందించే చద్ది కార్యక్రమం 15 వ రోజుకు చేరు కుంది. ఈ సందర్భంగా ఉదయం గణ పతి పూజ, సుబ్రహ్మణ్యం స్వామి ,శివ పార్వతులకు అష్టోత్తర శతనామావలి పూజలు పూజారి వాసుదేవ శాస్త్రి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పడి పూజలు ,భజనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వాములకు చద్ది కార్యక్రమం నిర్వహించారు. ఈ కా ర్యక్రమంను కమిటీ సభ్యులు పర్యవేక్షిం చారు.

## వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం



మార్టూరు, మేజర్‌న్యూస్: విజయనగర్ కాలనీ వెంకయ్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆశ్రమంలో దుబాయ్‌లో నివసిస్తున్న వలివేటి శివబాబు, ప్రశాంతి పెళ్లిరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ఈశ్వర్, చేతన్, సుజాత, రమేష్ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. వారు ఆశ్రమానికి రాలేని కారణంగా వారి మేనమామ మేనత్త డాక్టర్ కొర్రపాటి లక్ష్మీనారాయణ రమాదేవి చేతుల మీదుగా అన్నదానం జరిపించారు. ఆశ్రమ అధ్యక్షులు తన్నీరు శివరాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## వెలుగొండ నిర్వాసితులకు 18 సం.లు నిండిన వారికి ఆర్ఆర్ ప్యాకేజ్ ఇవ్వాలి: పివి కృష్ణారావు



మార్కాపురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం వెలుగొండ ముప్పు ప్రాంత ప్రజలకు ప్రస్తుతానికి 18 సంవత్సరాల వయసు నిండిన వారికి ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని మార్కాపురం అసెంబ్లీ ఇన్చార్జ్ పివి కృష్ణారావు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కాపురంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి వెలుగొండ ప్రాజెక్టు కొండంత అండని, పూర్తి చేయకుండానే జాతికి ఏ విధంగా అంకితం చేస్తారని కృష్ణారావు మండిపడ్డారు. బడ్జెట్లో నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని, రాబోయే ఎన్నికల వ్యూహమే అని విమర్శించారు. పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కేంద్ర ఇచ్చే నిధులను రాష్ట్రమిస్తున్నట్లు చెప్పుకుంటున్నారని, పీఎం మోడీ బొమ్మ వేయకుండా వారి బొమ్మలే వేసుకుంటున్నారని విమర్శించారు. అదేవిధంగా మార్కాపురం కేంద్రంగా మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.చంద్రశేఖర్, ఎం.లక్ష్మి, పి.సుబ్బా రావు, కోట శ్రీకాంత్, గాయం లక్ష్మిరెడ్డి, జీవీ రెడ్డి, కొప్పరపు రామ్నాథ్, వాసవి ప్రియ, ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలినేనిని కలిసిన జంకె వెంకటరెడ్డి



మార్కాపురం, మేజర్‌న్యూస్: వైకాపా జిల్లా అధ్యక్షులు, మార్కాపురం మాజీ శాసనసభ్యులు ఏపి ఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి మంగళవారం ఒంగోలులో మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వం కలిశారు.

## కోదండ రామాలయాన్ని సందర్శించిన ఇంటూరి

కందుకూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో టిడిపికందుకూరు నియోజ వకర్గం ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు స్వామిని దర్శించుకుని పూజలు



చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నాగేశ్వరరావును శాలువాతో సత్కరించుకొని, ఆలయ పూజారి గుంటూరు శ్రీనివాసమూర్తిచే ఆశీర్వచనం గావించినారు. ఆలయ పరిసరాలను పరిశీలించి ప్రశాంతమైన వాతావరణంలో ఆలయ నిర్మాణం జరిగి ఉండటం సంతోషదాయకంగా ఉన్నదని అన్నారు. ఆలయ పురోభి వృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కాకుమాను శ్రీనివాసరావు, దామ మల్లికార్జునరావు, కోటేశ్వరరావు, కంచర్ల గోపికృష్ణ, ఆలా ప్రసాదరావు, కాకుమాని ఆంజనేయులు, శ్రీను, అత్తంటి మాల్యాద్రి, జమ్మలమడుగు సుబ్రహ్మణ్యం, ప్రసాద్ రావు, కాలనీలోని మహిళా భక్తులు విరివిగా పాల్గొన్నారు.

## నేడు వైకాపా కార్యాలయం ప్రారంభం



దర్శి, మేజర్‌న్యూస్: దర్శిలో వైకాపా కార్యాలయంను బుధవారం ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమెల్యే, వైకాపా నియోజకవర్గం ఇంచార్జ్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఒంగోలు ఎమెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, వైకాపా జిల్లా కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు జంకె వెంకట రెడ్డి, జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొంటారని తెలిపారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని శివ ప్రసాద్ రెడ్డి కోరారు.

## జెఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రీగాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమి విద్యార్థినీ

కందుకూరు, మేజర్‌న్యూస్: జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్స్ ఫలితాల్లో కందుకూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమికి చెందిన కె చంద్రిక అనే విద్యార్థిని 96.09 పర్సంటైల్ సాధించింది. సాధారణ మద్యతరగతి కుటుంబానికి చెందిన తాను పట్టుదలతో చదవడం వలనే జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలను సాధించానని తెలిపారు. శ్రీగాయత్రి విద్యాసంస్థలచైర్మెన్ సిహెచ్ రామకృష్ణ విద్యార్థినిని అభినందించి శ్రీగాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమి ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలోనే ఉత్తమ ఫలితాన్ని అందించామన్నారు.



భవిష్యత్తులో కందుకూరు ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరంలేకుండా శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమిలో ప్రణాళికా బద్దంగా శిక్షణ ఇస్తామని తెలిపారు.





## జీవనోపాధి కల్పించేందుకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

**- మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి**

కనిగిరి, మేజర్‌న్యూస్: మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇప్పిస్తున్నట్లు కనిగిరి టీడీపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు.స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో కుట్టున్ మిషన్ శిక్షణ కోసం వచ్చిన మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యాలయంలో త్వరలో కుట్టు మిషన్ శిక్షణ జరుగుతుందని చెప్పారు. మొదటి విడతగా వితంతువులు, ఒంటరి మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మలి విడతలో అనాధలు, ఏ ఉపాధి లేని పేద మహిళలుకు విడతల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు శ్రద్దగా కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకొని కుటుంబానికి ఆసరా కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కరణం అరుణ, వాజిదా, తులసి, పార్వతి, నారాయణమ్మ, దొరసాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తాం

**- దేవాలయ చైర్మన్ ఐ.వి సుబ్బారావు**



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండలంలో స్వయంభూగా వెలసిన శ్రీమత్ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారు శ్రీ త్రిపురాంబిక సమేత త్రిపురాంతకేశ్వర ఉభయ దేవాలయాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవి సుబ్బారావు తెలిపారు. మార్చి 8న జరుగునున్న మహాశివరాత్రి మూడు రోజులపాటు జరిగే మహోత్సవాలకు అన్ని శాఖల అధికారులతో మంగళవారం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవాలయ ధర్మకర్త ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ 11వ తేదీనే ఉభయ దేవాలయాల నూతన పాలకమండలి ధర్మకర్తల ఎంపిక జరిగి తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నారని అందుకు తమ వంతుగా అందరూ సహకరించండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన విధంగా అన్ని శాఖల సహకారంతో మహాశివరాత్రికి వచ్చేభక్తులకు తగిన సౌకర్యం ఏర్పాట్లు కల్పిస్తామని ఆయన అన్నారు. తాగునీరు, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని వచ్చే భక్తుల రద్దీకి తగిన విధంగా ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు పోలీస్ శాఖ అధికారులు తగు ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు. త్రిపురాంతకం గ్రామ పంచాయతీ సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నంతలో ఈ మహాశివరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అంటూ వ్యాధులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా శానిటేషన్ చేయిస్తామని పంచాయతీరాజ్ శాఖ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తామని వచ్చిన భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పిస్తామని వెంకటలక్ష్మి అన్నారు. త్రిపురాంతకం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఈ మహాశివరాత్రి మహోత్సవాలకు 300 మంది పోలీస్ సిబ్బందిని ఈ మూడు రోజులపాటు వచ్చే పోయే వాహనాలను ట్రాఫిక్ కంట్రోల్ చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేస్తామని సి.ఐ సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం రోడ్డు రవాణా సంస్థ మోటార్ వాహనాల అధికారులు నాయక్, మాధవరావు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, చైర్మన్ సుబ్బారావు, మండల డిప్యూటీ తాసిల్దార్ భ్రమరాంబ, వడియరాజుల అన్నదాత అధ్యక్షులు డి.శ్రీనివాస్, స్థానిక ఎస్సై సాంబశివయ్య ఏఎస్ఐ భాస్కర్ రెడ్డి కొందరు పోలీసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. అందరికీ దేవస్థానం తరపున భోజనం వితరణ చేశారు.

## కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఇంచార్జ్ హనిమిరెడ్డి

అద్దంకి, మేజర్ న్యూస్: పట్టణంలోని 20వ వార్డులో వైఎస్ఆర్సిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సమావేశానికి అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ పానెం హనిమి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు



స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాతదామావారి పాలెం కు చెందిన 30 మంది యువకులు తెదేపాను వీడి వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు మరియు నాయకులు పిలిమెట్ల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



## పిచ్చిగుంట్లపల్లిలో బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారంటీ

మార్కాపురం, మేజర్‌న్యూస్: కందుల విగ్నేష్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం మండలంలో పిచ్చిగుంట్లపల్లి గ్రామంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. హారతులు, పూలదండలు, శాలువాలతో 'బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ సూపర్సిక్స్ పథకాల గురించి వివరించారు. నలభై సంవత్సరాలు విలువలతో కూడిన రాజకీయాలకు పెట్టిందే పేరు చంద్రబాబు నాయుడు అని ఇంటింటికి తిరిగి కార్యక్రమంను తెలుగుదేశం నాయకులు చేపట్టారు. అక్రమంగా కేసులో ఇరికించి చంద్రబాబునాయుడుని ఇబ్బంది పెట్టిన ఈ ప్రభుత్వం త్వరలో పతనం అవుతుందన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం

**భారతీయ జవాన్ కిసాన్ పార్టీ అధ్యక్షులు వరికూటి ఆంజనేయులు**

**ఒంగోలులో 'జై జవాన్ జై కిసాన్' జోడో యాత్ర**



ఒంగోలు, మేజర్‌న్యూస్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తామని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వరికూటి ఆంజనేయులు తెలిపారు. ప్రజలు, రైతులు, యువతతో పాటు జవాన్లు, విశ్రాంతి జవాన్లు భద్రత, సంక్షేమమే ధ్యేయంగా భారతీయ జవాన్ కిస్సాన్ పార్టీ పని స్పష్టం చేశారు. మంగళవారం ఒంగోలులో నగరంలో జై జవాన్ జై కిసాన్ జోడో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్య క్షులు వరికూటి ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్మీ, న్యావీ, ఏయిర్ ఫోర్స్, సిఆర్‌పి, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బిలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన తర్వాత సమా జంలో ప్రజలు, రైతులు, యువత ఎదుర్కొం టున్న పలు సమస్యలను చూసి చలించిపోయా మన్నారు. ప్రజలే కాకుండా సైనికులు, మాజీ సైనికులకు జరుగుతున్న తీవ్ర అన్యాయాన్ని చూడలేక భారతీయ జవాన్ కిసాన్ పార్టీని స్థాపించండి జరిగిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా బడుగు బలహీన వర్గాలు, ప్రజలు, రైతులు, యువత దగాకు గురౌతూనే ఉంది. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందుతున్నారు. పంటకు గిట్టుబాటు ధర లేదు, నాణ్యమైన ఎరువులు పంపిణీ చేయడం లేదు, పంటలకు పంట నష్ట నివారణ భీమా సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత పెరిగిపోతుందన్నారు. ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల చేతకాని తనం వలనే రాష్ట్రాల్లో ప్రజ లకు ఈ గతి పట్టిందన్నారు. అందుకోసమే వచ్చే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో భారతీయ జవాన్ కిసాన్ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు ఆదరించా లని విజ్ఞప్తి చేశారు.

ఈ యాత్రలో జాతీయ నాయకులు నారాయణ అంకుష్, కె.ఎన్ నాయక్, సురేష్‌కుమార్, మహిళా రాష్ట్ర అధ్యక్షులు జయంతి, వై.రాజు, పార్టీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మాగుంట ఒంగోలుకు రాక



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి నేడు ఒంగోలు నగరానికి రానున్నట్లు కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం 8గంటలకు నగరం లోని రామ్ నగర్ రెండో లైన్‌లోని మాగుంట కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 10గంటలకు స్థానిక కార్యక్ర మాల్లో పాల్గొంటారు. అనంతరం కార్యకర్తలకు మాగుంట అందుబాటులో ఉంటారని తెలిపారు.

## 16న టైర్ బంద్‌ను జయప్రదం చేయాలి



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఈనెల 16వ తేదీన టైర్ బంద్‌ను జయప్రదం చేయాలని గంటెనపల్లి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ఒంగోలు సిఐటియు కార్యాలయంలో ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ నగర కమిటీ సమావేశం దాసరి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి గంటెనపల్లి శ్రీనివా సులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా 16వ తేదీ దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుంది. ప్రకాశం జిల్లాలో టైర్ బంద్ కార్యక్రమం నిర్వహించాలని శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు సత్యం, ఆనంద్, అంగిరేకుల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల జీవితాల్లో జగన్ ఆడుకోవొద్దు : రాయపాటి జగధీష్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : నిరుద్యోగ యువత జీవితాల్లో వైసీపి ప్రభుత్వం ఆడుకోవొద్దని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగధీష్ హెచ్చరించారు. స్థానిక విద్యార్థి జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగధీష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ -2 డీఎస్సీ 6100 పోస్టులకి వయోపరిమితి పెంచలేదని, ఎంతోమంది విద్యార్థులు నిరుద్యోగ యువత ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 పోస్టులు తక్కువగా ప్రకటించింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రూప్-2 పరీక్షకి 46 సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని, డీఎస్సీ ఉద్యోగాలు 20000 పోస్టులు ఇవ్వాలని, డీఎస్సీ అభ్యర్థులకు కూడా వయోపరిమితి 46 సంవత్సరాలు ప్రకటించాలని, పరీక్ష తేదీని కూడా పెంచాలని తక్కువ సమయంలో చాలామంది విద్యార్థులు పరీక్ష రాయలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత డిమాండ్లు పరిష్కరించకపోతే యువత నిరుద్యోగులు సిద్ధం గర్జన ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని రాయపాటి జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్, జిల్లా అధ్యక్షులు కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిడతల కరుణాకర్, ఒంగోలు నగర అధ్యక్షులు శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, బాపట్ల జిల్లా అధ్యక్షులు దుడ్డు మార్క్, లోకేష్, రాజీవ్, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల హామీలను విస్మరించిన బిజేపికి బుద్ధి చెప్పాలి

**16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్షాల మద్దతు**

**బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపు**



ఒంగోలు, మేజర్‌న్యూస్: సంయుక్త కిసాన్ మోర్చా, భారత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు పాల్గొని మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఐదువందల రైతు సంఘాలు, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈ బంద్ పాల్గొంటున్నాయని తెలిపారు. బందు వామపక్ష పార్టీల తరుపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. బడ్జెట్లో వీటిమీద చర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను బలోపేతం చేస్తూ దేశ సంపదను అంబాని, ఆదానిలకు దోచిపెడు తుందన్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగాజరిగే బంద్లో వామపక్ష శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలపాలని, బంద్, సమ్మెల్లో జిల్లాలో ఉన్న రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలమీద 13 నెలల పాటు జరిగిన సుదీర్ఘ పోరాటం తరువాత మూడు నల్లచట్టాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటిం చిన బిజెపి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా రైతులకు ఇచ్చిన హామీలు ఏమి అమలు చేయలేదన్నారు. సిపిఐఎంఎల్ (న్యూడెమొక్రసి) రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెమీద నిర్భందాన్ని ప్రయోగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశ్వయత్నాలు చేస్తుందన్నారు. ఢిల్లీ చుట్టూ కంచెలు వేయడం, బారికేడ్లు పెట్టడం ఆపార్టీ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ కంకణాల ఆంజనేయులు, సిపిఐ నాయకులు పివిఆర్ చౌదరి, ఆర్ వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు ఎంఎస్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ నిర్మాణానికి భూమిపూజ



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన నాగులుప్పల పాడులో చెత్త ద్వారా సంపద తయారు చేసే షెడ్డు నిర్మాణంకు మంగళ వారం ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, ఎంపీడీవో మహాలక్ష్మి ఉపాధి హామీ పథకం ఈసి విజయలక్ష్మి నాయకులు పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పాద పవన్, మదిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, గండు వెంకటరావు, కుక్కల గోపిరెడ్డి, తోకల శ్రీను పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండల పరిషత్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులు మాయా శాఖల నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. సర్వసభ్య సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు.

# రామాంజనేయులు కుటుంబాన్ని పరామర్శించిన బీఎన్

నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్ : మండలంలోనీ స్టాలిన్ బాబు చిన్నాన్న (బాబాయ్) ఊదరగుడి రామాంజనేయులు (49) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, సంతనూతలపాడు టీడీపీ ఇంచార్జ్ బిఎన్.విజయ్ కుమార్ హాజరయ్యి మృతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి,మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి,జర్నలిస్టులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నాగులుప్పలపాడు మండల టీడీపీ నాయకులు, మాజీ ఎస్సి సెల్ పైడి నాగేశ్వరావు, సిపిఎం పార్టీ నాయకులు తుబాటి శ్రీకాంత్, నాగరాజు, చల్లాపల్లి రాజు,లెనిన్, బ్రెజ్నవ్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అనంతరం గ్రామ సర్పంచ్ వడిముక్కల శ్రీనివాసరావు పూలమాల వేసి, నివాళులర్పించారు.

## కోలలపూడిలో ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలించిన జపాన్ బృందం



మార్టూరు, మేజర్‌న్యూస్: ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు అని రాష్ట్ర అధికారి టి.విజయ కుమార్ అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోలలపూడిలో జపాన్ దేశానికి చెందిన స్టీఫెన్ కూచో, మద్యుస్ బస్టల్షియం, జకో నదోల్, స్మిలా జాకబ్ బృందం పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయలోఅమృతాలు, కాషాయలు తయారీ, జీవమృతం తయారీకి అవసరం అయ్యే పదార్థాలు, వాటి వల్ల ఉపయోగలును ప్రత్యక్షంగా చూసి తెలుసుకొన్నారు. పండిన పంటల దిగుబడి, మార్కెట్ రవాణా సౌకర్యాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ పంటలు తిన్నవారు ఆరోగ్యంగా ఉంటారని విజయ కుమార్ జర్మనీ బృందానికి వివరించారు. రైతు బలగాని వెంకటస్వామి, మహిళా రైతు కొటేశ్వరమ్మకు చెందిన పంటలు పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి ఎస్.వాణిశ్రీ, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, ఏ.డి.ఏ, సిడిపియం, బాపట్ల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో శ్రీసరస్వతి విద్యార్థుల ప్రతిభ



తాళ్లూరు, మేజర్‌న్యూస్: సౌత్ ఇండియా రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో తాళ్లూరు శ్రీ సరస్వతి హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. గుంటూరులోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కాలేజీలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్- 14 విభాగంలో స్పీడ్ హెూం స్తిప్పింగ్ పోటీల్లో 8 తరగతి విద్యార్థిని పూర్ణిమ ప్రథమ స్థానం సాధించగా అండర్ -17 విభాగంలో స్పీడ్ స్పిరిట్ పోటీల్లో 9 తరగతి విద్యార్థిని పావని ద్వితీస్తాను సాధించడం జరిగింది. డబుల్ టచ్ గ్రూపులో స్నేహలతారెడ్డి, బ్లెస్సి ద్వితీయ స్థానం సాధించగా బాలురు విభాగంలో స్పీడ్ డబుల్ అండర్ రిలే గ్రూప్ పోటీల్లో ఈశ్వర్, సురేంద్రారెడ్డి, సాయిచరణ్, నెహెమియా ద్వితీయ స్థానం సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పీ.ఈ.టీ బిజ్జం వికాస్ ని శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏ.వి. రమణారెడ్డి హెచ్.ఎం శ్రీరామ మూర్తి, డీన్ వెంకటరెడ్డి, రత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

## జగనన్న ఆరోగ్యసురక్ష పేద ప్రజలకు వరం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హెూమద్యుతి, పలువురు అన్నారు. మంగళవారం మండలంలోని రేగులచెలక సచివాలయం పరిధిలో రెండవ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని అయ్యలూరివారిపల్లె, రేగులచెలక పంచాయితీల నుండి వచ్చిన పలువురికి వైద్యబృందం వివిధరకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామస్థాయిలో అందుబాటులో వైద్యులచే వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసి ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలని లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం సురక్షకిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హెూమద్యుతి, మహేష్, పంచాయితీ కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసిన బాపట్ల పోలీస్

బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం రూరల్ పోలీస్ స్టేషన్లో బాపట్ల డిఎస్పి టి. వెంకటేశులు పత్రికా సమావేశం నిర్వహించారు.బాపట్ల రూరల్ పరిధిలో ఇటీవల జరిగిన హత్యకు సంబంధించిన పూర్వపద వివరాలు మీడియా కు తెలిపారు. డి.ఎస్.పి తెలిపిన వివరాలు ఈ కేసులో ఏ1 వినోద్ బాపట్ల టౌన్ నందు కార్ ట్రావెల్స్ నడుపుతున్నాడని, అతని చిన్ననాటి స్నేహితుడు యాసిన్ ప్రముఖ న్యూస్ ఛానల్ లో పనిచేస్తూ కారు డ్రైవింగ్ స్కూల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడని, సుమారు సంవత్సరం నుండి బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ కాకుండా తిరుగుతున్నా రాహుల్ తేజ పై వినోద్ బాపట్ల టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించాడని అప్పటినుండి వినోద్ పైన రాహుల్ తేజ కోపంతో ఉన్నాడని. బాపట్ల పట్టణంలోని విజయ్ కృష్ణ సినిమా థియేటర్ మేనేజర్ ను, అలాగే ఉసిరికాయల శీను అనే న్యాయవాదిని కత్తితో పొడవుగా ఆ వార్తను విలేకరిగా పనిచేస్తున్న ఏ 2 యాసీన్ న్యూస్ లో పోస్ట్ చేసేవాడని విషయాన్ని మనసులో పెట్టుకొని యాసిన్ మీద సోను కక్షతో ఉన్నాడని రాహుల్ తేజ, సోను, వెంకట సుమంత్ మృతుడు మంచి స్నేహితులు



అయినందున వారిద్దరూ రెండు గ్రూపులుగా ఏర్పడి బాపట్ల టౌన్ నందు తరచుగా గొడవలు చేసుకుంటూ ఉండేవాళ్లు అదే క్రమంలో ఫిబ్రవరి 6వ తేదీన వినోద్, యాసిన్ అతని స్నేహితులు, రాహుల్ తేజ, సోను, సుమంత్( మృతుడు) వారి స్నేహితులు మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో అనుకోకుండా జీవిసి రోడ్లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద ఎదురెదురు పడి ఇద్దరు గ్రూపులు వారు ఘర్షణ చేసుకొని ఒకరినొకరు చంపుతామని బెదిరించుకున్నారని అదే రోజు సాయంత్రం సుమారు 6:30 గంటలకు రాహుల్ తేజ,సోను, సుమంత్ అతని స్నేహితులు కలిసి సూర్యలంక రోడ్లోని పందెంకోడి రెస్టారెంట్లో ఉండి బిర్యాని తింటూ ఉండగా వినోద్, యాసిన్ కలిసి వాళ్ళ బంధువులను, టాక్సీ డ్రైవర్ని తీసుకొని వెళ్లి రాహుల్ తేజ, సోను, సుమంత్ ల మీద వారి స్నేహితులు మీద కత్తులు, కర్రలతో దాడి చేయగా రాహుల్ తేజ, సోనులు పారిపోగా వారి స్నేహితుడైన వెంకట సుమంత్ వాళ్ళకి చిక్కగా సుమంత్ ని అందరు కలిసి కర్రలతో కొడుతుండగా వినోద్ కత్తితో సుమంత్ ను పొడిచి చంపేశాడని హత్య జరిగిన రోజున పోలీసులు 11 మందిని(పండూరి వినోద్, షేక్ యాసిన్, పండూరి సతీష్, మేకల వినోద్, నాయుడు కుప్పం అనిల్, పంది ప్రవీణ్ బాబు, మేకల మరీయ దాసు, దులిపూడి శివ సాయి, తోట బాబు, పండూరి మహేష్, ఇకటి అశోక్) చింతావారిపాలెం అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేశామని 12వ వ్యక్తి మార్పు డేనియల్ పరారీలో ఉన్నాడు. ఎక్కడున్నాడన్న సమాచారం దొరికింది పట్టుకొస్తామని తెలిపారు. మృతుడు గోరంట్ల సుమంత్ తల్లి గోరంట్ల సుష్మాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సి ఆర్. నెంబర్.23/2024 అండర్ సెక్షన్ 147, 148, 307, 427, 302 ఆర్/డబ్ల్యు నమోదు చేశారు ఐపిసి ఆఫ్ బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్. ఈ సమావేశంలో ట్రైనీ డిఎస్పి, రూరల్ సీఐ హజరత్ బాబు, రూరల్ సి ఐ వై. శ్రీహరి,యస్ ఐ శంకర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ లో సత్తా చాటిన బాపట్ల జిల్లా హెడ్ కానిస్టేబుల్

బాపట్ల, మేజర్‌న్యూస్: ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీలలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం లోని గచ్చిబౌలి స్టేడియం నందు జరిగిన 5వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున 40 ప్లస్ విభాగంలో పాల్గొని పోల్ వాల్ట్, షర్ట్ పుట్ లలో బాపట్ల జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పతకాలు సాధించాడు.పోల్ వాల్ట్ లో స్వర్ణ పతకం, షర్ట్ పుట్ లో రజత పతకం సాధించి, ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్న నాగరాజు మే లో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ కు ఎంపిక అయ్యాడు. జాతీయస్థాయిలో బాపట్ల జిల్లా పోలీస్ ఖ్యాతిని ఇనుమడింపజేసి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ కు ఎంపికైన నాగరాజును ఫిబ్రవరి 13 మంగళవారం బాపట్ల జిల్లా ఎస్పి క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి మెడల్స్ తో సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతీయస్థాయిలో 24 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొన్నా 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున బాపట్ల జిల్లా పోలీస్ శాఖ నుండి 40 ప్లస్ విభాగంలో పాల్గొన్నా హెడ్ కానిస్టేబుల్



సిహెచ్.నాగరాజు పోల్ వాల్ట్ లో స్వర్ణ, షర్ట్ పుట్ లలో రజత పతకాలు సాధించి జిల్లా పోలీస్ క్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింప చేయడం అభినందనీయమన్నారు. మే లో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ లో కూడా పాల్గొని పతకాలను సాధించాలన్నారు. నాగరాజును స్ఫూర్తిగా తీసుకొని జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనాలన్నారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహం ఉంటుందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వెలుగువారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఏ ఏ), అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం తూర్పు గంగ వరం హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం ను కూడా పరిశీలించారు. కార్యక్రమం లో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డితో పాటు ప్రధానోపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, అంగన్వాడీ టీచర్ సునీత, సిహెచ్ఓ ప్రభావతి, ఏఇన్ ఎమ్.సుజాత, ఆశా కార్యకర్తలు అంజమ్మ, శ్రీదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవనానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం



మార్టూరు, మేజర్‌న్యూస్: పెంట్యాల ఉదయేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య వెంకటరత్నం కుమార్తె అల్లుడు ముంబై వాస్తవ్యులు పెంట్యాల జయశ్రీ, రాజ్ కుమార్ స్థానిక అమ్మ ఆశ్రమం నూతన భవనానికి 25వేలు రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. జొన్నతాళి వాస్తవ్యులు శానంపూడి పుల్లారావు ద్వారా వారి మనవడు అన్నదానానికి ఆశ్రమానికి చేయూతనివ్వడం మంచిదని అమ్మ ఆశ్రమ అధ్యక్షులు గుంటుపల్లి చందు అన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌ను డిఎస్పీ కిషోర్ తనిఖీ



సింగరాయకొండ, మేజర్‌న్యూస్: ఒంగోలు డి.ఎ స్.పి కిషోర్‌బాబు మం గళవారం సాధారణ తనిఖీ ల్లో భాగం గా సింగ రాయ కొండ పోలీ స్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్లోని పాత కేసుల రికార్డులను పరిశీ లించారు. పట్టణంలోని రౌడీషీటర్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు విషయంలో పలు సూచ నలు చేశారు. ఆయన వెంట సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.రంగనాథ్, ఎస్సై శ్రీరామ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చేరెడ్డి ఆత్మీయ సమ్మేళనం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: నియోజకవర్గ సీనియర్ వైసీపీ నాయకులు చేరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం, కొమరోలు, రాచర్ల, గిద్దలూరు మండలాల ముఖ్యనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, జడ్పిటీసీలు, ఎంపీపీ, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీ లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసిల్దారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎన్ పాడు నియోజక వర్గ సమన్వయకర్త మేరగు నాగార్జున అన్నారు. ఒంగోలు తన కార్యాలయం నందు మంగళవారం నియోజకవర్గం నాలుగు మండలాల తహసిల్దారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ తమ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచా యితీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ పాడు డీటీ శాంతి, చీమకుర్తి ఎమ్మా ర్వో సురేష్, మద్దిపాడు ఆశాజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవులకు స్మశాన వాటిక కేటాయించడం హర్షణీయం

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో క్రైస్తవుల కోసం ప్రత్యేకంగా శ్మశానవాటిక కేటాయించడం హర్షించదగ్గ విషయం అని క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు గోన రంజిత్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వాలు ఏ మాత్రం చొరవ చూపకున్నప్పటికీ నేటి వైసీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని గిద్దలూరు పట్టణంలో క్రైస్తవుల కోసం ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటుకు చొరవతీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రైస్తవ శ్మశానవాటిక ఏర్పా టుకు కృషి చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు క్రిస్టియన్స్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## జంకెకు అభినందనలు



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఏపీ ఐఐసి చైర్మన్‌గా నియమితులైన ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు జంకె వెంకట రెడ్డిని వైఎస్సార్సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతా నాగరజప్ప గౌడ్, రామరావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

## పలువురిని పరమార్శించిన ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు, మేజర్‌న్యూస్ : స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవి కుమార్ మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి పలువురు కార్యకర్తలను పరామర్శించారు మండలంలోని చవిటి పాలెం గ్రామానికి చెందిన కుంచపు కొండలు ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు అదే గ్రామానికి చెందిన వీరవల్లి ప్రసాద్ ఇటీవల గాయపడగ ఆయ నను పరామర్శించారు చవిటి పాలెం గ్రామ మాజీ సర్పంచ్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి నారు మినీ కళ్ళు గ్రామానికి చెందిన ముప్పాళ్ళ నాగేశ్వరరావు అరుణ కుమార్తె వివాహానికి హాజరై ఆయన ఆశీర్వదించారు అదే గ్రామానికి చెందిన ముప్పాళ్ళ కాంతయ్యను పరామర్శించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట బాపట్ల పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి తేలప్రోలు రమేష్ బాబు మండల టిడిపి అధ్యక్షులు గారి పత్రి వెంకట్రావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

అద్దంకి, మేజర్‌న్యూస్: ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన వెంకట్రావు కుమారుడు సత్యనారాయణ ప్రసాద్ బ్లడ్ క్యాన్సర్ కారణంగా బసవతారకం వైద్యశాలలో వైద్యం చేయించు కుంటున్నాడు. అతని వైద్యానికి సుమారు 25 లక్షలు ఖర్చు అవుతుందన్న విషయం తెలుసు కున్న వివిధ సంస్థల బాధ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మల్లాది శ్రీనివాసరావు, చుండూరి మురళి సుధాకర్, ప్రధానోపాధ్యా యురాలు అనిత, లక్కరాజు చంద్రశేఖర్, డాక్టర్ యు దేవపాలన, వారణాసి రఘురామ శర్మ, చప్పిడి వీరయ్య, కంతంరాజు శివరామ కోటేశ్వరరావు, లక్కరాజు శ్రీనివాసరావు కలసి 6500 రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధితుని కుటుంబానికి చెందిన శ్రీనివాసరావుకు మంగళవారం రోటరీ కార్యాలయం వద్ద అందజేశారు.



## వైసిపి గెలుపుకి కలిసికట్టుగా కృషి చేద్దాం

అద్దంకి, మేజర్ న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వైకాపా అద్దంకి నియోజకవర్గ ఇన్చార్జ్ పానెం హనిమిరెడ్డి అన్నారు. అద్దంకి పట్టణంలో శ్రీ ప్రసన్నాంజనేయ నేస్తం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఆటో ర్యాలీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా బంగ్లా రోడ్డు వద్ద గల రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడ నుంచి సింగరకొండ రహదారిలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు ఎంతో మేలు జరిగిందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీకి అండగా ఉండి జగన్మోహన్ రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా అద్దంకిలో హనిమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని వైకాపా జెండా ఎగరవేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నాగిపోగు చక్రవర్తి, ఉపాధ్యక్షులు దాసరి బుల్లయ్యతో పాటు రెండు వందలకు పైగా ఆటోలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.



## రాబోయే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

### - ఎంపీపీ రామన మహాలక్ష్మి

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామన మహాలక్ష్మి మాట్లాడుతూ రాబోవు నెలలో తీవ్రమైన ఎండలు వస్తున్న నేపథ్యంలో మండలంలో ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించడం జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలో పనిచేస్తున్న అధికారుల తమ నివేదికలను ప్రవేశపెట్టాలని కోరారు ఈ సందర్భంగా మండల స్థాయి వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రతిపాదనలను సమావేశంలో వివరించడం జరిగింది మండలంలోని 21 పంచాయతీల కేవలం నాలుగు నుంచి ఐదులోపు మాత్రమే హాజరు కావడం జరిగింది. మండలంలో పది



ఎంపీటీసీలకు గాను నామమాత్రంగా హాజరు కావడం జరిగింది ఎంపీపీ రామన మహాలక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలందరూ వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్ర రావు, ఏపీవో లక్ష్మీనారాయణ, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ 1వ సెమిస్టర్ ఫలితాల్లో జీవనజ్యోతి డిగ్రీ కాలేజీ విద్యార్థినీ ద్వితీయ స్థానం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: శ్రీజీవనజ్యోతి డిగ్రీ కళాశాల గిద్దలూరులో మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థిని షేక్ అఫ్రోజ్ సుల్తానా 2023 డిసెంబర్లో ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒంగోలు వారు నిర్వహించిన బీసీఏ కోర్సులో మొదటి సెమిస్టర్ పరీక్షలలో యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం 8.57 ఎస్‌జిపిఏను సాధించినదని యూనివర్సిటీ అధికారులు ప్రకటించినారు. శ్రీజీవనజ్యోతి డిగ్రీ కళాశాల గిద్దలూరు యాజమాన్యం శ్రీరెడ్డి వెంకట్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది మొదలగువారు విద్యార్థి షేక్ అఫ్రోజ్ సుల్తానాను అభినందించారు.

## నల్లబండ బజార్లో కమీషనర్ శ్రీనివాసరావు పర్యటన



గిద్దలూరు, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలోని నల్ల బండ బజారు, జంగాల కాలనీలో పారిశుధ్య కార్యకలాపాలను నీటి సమస్యపై వార్డులో గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వి.శ్రీనివాస రావు పర్యటించి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం మన అందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ చెత్తను సేకరణకు నివాసాల వద్ద చుట్టుపక్కల రహదారులలో చెత్తను వేయరాదు చెత్తను కేవలం చెత్త సేకరణకు వస్తున్న రిక్షాలోనే వేయవలెను నీటి సమస్య జటిలంగా ఉందని కాలని వాసులు కమిషనర్ ఎదుట వారి బాధలను తెలుపగా కమిషనర్ వారి సమస్యలను సావధానంగా విని వెనువెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని నీటి విభాగం వారికి ఆదేశాలు జారీ చేశారు.

## 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

### - సభకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్న అన్నదాత కామూరి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భారత జాతి కోసం అమరత్వం చెందిన రోజు ఫిబ్రవరి 22న డిజిఆర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నరవ రోడ్ నందు కనివిని ఎరుగని రీతిలో వర్ధంతిని ఏర్పాటు చేస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి తెలియజేశారు. మంగళవారం రోజు కొమరోలులోని కామూరి రమణారెడ్డి అన్నదాత స్వగృహంకు వెళ్లి 1000 మందికి భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కామూరి రమణారెడ్డి అన్నదాతను అడిగి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు చెప్పగానే చాలా మంచిది రుచికరంగా పాల్గొనే వారికి భోజనం ఏర్పాటు చేసుకోండి నేను ఏర్పాటు చేస్తానని చెప్పారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని బాగా చేయాలని మంచి కార్యక్రమం ఆయన స్వాతంత్ర్యం కోసం మొదటగా పోరాట యోధుడైనటువంటి వ్యక్తికి గిద్దలూరులో వర్ధంతి కార్యక్రమం చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. అడగగానే వెయ్యి మంది ప్రజలకు భోజనం ఏర్పాటు చేస్తున్న అన్నదాతకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కమిటీ తరపున వారికి వారి కుటుంబానికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసుకుంటున్నామని సభ్యులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బియస్ నారాయణరెడ్డి సంఘసేవకులు, సామాజిక కార్యకర్త వడ్డే వెంకటరామిరెడ్డి తెలిపారు.



## బీసీలకు అండ టిడిపి

### - టిడిపి హయాంలోనే మహిళలకు రక్షణ

దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని బిసిలకు టిడిపినే అండ అని జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బి.సిలకు రక్షణ లేకుండా పోయిందని బి.సి నాయకులు తమ్మిశెట్టి అచ్చయ్య అన్నారు. ప్రతి పల్లెకు ప్రజాయాత్ర కార్యక్రమంలో భాగంగా మండలం చందలూరు గ్రామంలో బీసీ నాయకులు తమ్మిశెట్టి అచ్చయ్య అధ్యకతనా జరిగింది. తమ్మిశెట్టి అచ్చయ్య మాట్లాడుతూ బీసీల కోసం టీడీపీ పార్టీ నిరంతరం అండగా




ఉంటుందని, వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది అని అన్నారు. టీడీపీ ప్రకాశం మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు, డ్వాక్రా సంఘాలు పెట్టి మహిళలు ను మహారాణులు చేశారన్నారు. మహిళలకు అన్ని రంగాలలో టీడీపీ పార్టీ సముచిత స్థానం కల్పించిది అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లేదు అన్నారు. రాష్టంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతో మంది ప్రభుత్వ ఉద్యో గస్తులను వేదిస్తోంది అని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ పార్టీని తుది ముట్టించిండానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, కృష్ణ, వెంకట స్వామి, శంకర్, నాగమణి, గురమ్మ, మల్లేశ్వరి, మేఘన, గురునాధం కీర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా బీజేపీ మైనార్టీ అధ్యక్షులుగా షేక్ ఖాదర్ వలీ షఫీ

గిద్దలూరు, మేజర్‌న్యూస్: మంగళవారం జిల్లా బీజేపీ అధ్యక్షులు పీవీ శివా రెడ్డి గిద్దలూరు చెందిన( చాయ్ బక్స్ టీ పాయింట్)అధినేత పట్టణంలో ప్రముఖ మైనార్టీ నాయకుడు షేక్ ఖాదర్ వలీ షఫీని జిల్లా బీజేపీ అధ్యక్షులు పివి శివారెడ్డి నిన్నటి రోజు విజయవాడ బీజేపీ ఆఫీస్ నందు పురంధేశ్వరి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరిన షేక్ ఖాదర్ వలీనీ ప్రకాశం జిల్లా బీజేపీ మైనార్టీ అధ్యక్షులుగా నియామకం చేయడం జరిగింది. ఈ



సందర్భంగా గిద్దలూరు చాయ్ షాప్‌లో గిద్దలూరు పట్టణ బీజేపీ ముఖ్య నాయకుల మధ్య బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు, అపిసెట్టి ఉదయ్ శంకర్,జిల్లా కార్య వర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, జిల్లా ప్రచార కన్వీనర్ ఆర్.కాసులు, నియోజక వర్గ గరిబ్ కళ్యాణ్ అన్న యోజన ఇంఛార్జి కమలాపాటి చంద్ర మోహన్, పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి మునగనూరి రామకృష్ణ, నియోజక వర్గ ఎస్సీ మోర్చ ఇంఛార్జి బండారి జయ ప్రసాద్, సీనియర్ నాయకులు శివపురం రవి, పట్టణ ఒబిసి మోర్చ అధ్యక్షులు ఎం.రమణ, పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షులు నజీర్, బాజీ, నాయకులు పాల్గొనడం జరిగింది.

## ప్రతి రైతు లబ్ధి పొందుటకు ఈకెవైసి చేయించాలి

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని దోసకాయలపాడు క్షేత్ర పర్యటనలో భాగంగా ఏఓ బి.ప్రసాద్ రావు వి.ఎ.ఎలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ రానున్న 10 రోజులు ప్రతీరోజు 'కామన్ సర్వీస్' సెటర్ ప్రతినిధి, వాలంటీర్లు, వి.ఏలతో కలిసి క్యాంపులు నిర్వహించి మిగిలి పోయిన రైతులచే ఈకెవైసి



చేంచి పథకాలకు అర్హులుగా చేయాలని తెలిపారు. భారత ప్రభుత్వం క్యాంపులు నిర్వహించి నూరుతం ఈకేవైసి చేయించి, మంచి ఫలితాలు సాధించిన వారికి అవార్డులను ప్రకటిస్తుంది ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వి.వి.ఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

## ఏపీఐఐసి చైర్మన్‌గా జంకె వెంకటరెడ్డి నియామకం హర్షం

### - వైసీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ గౌస్ మోహీద్దీన్

మార్కాపురం, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపిఐఐసి)చైర్మన్‌గా జంకె వెంకట రెడ్డి నియమితులు కావడంపల్ల మార్కాపురం వైసీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ గౌస్ మోహీద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎంపిక ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ముందే చేసివుంటే బాగుం డేదని ఆయన అభిప్రాయపడ్డారు.



మార్కాపురం సీటు త్యాగం చేసిన జంకె వెంకటరెడ్డికి పార్టీ తగిన గౌరవం ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఈ నియా మకం కొన్నేళ్లు ముందుచేసివుంటే పార్టీ నాయకులు, శ్రేణుల ఇంకా ఎంతో ఆనంద వ్యక్తంచేసేవారని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీలో కష్టపడి పనిచేసే వారికి వదిలేసి నియోజకవర్గంలో రాజకీయ పెద్దలకు చక్కభజన చేసే వారికి అవకాశాలు ఇచ్చారని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా పార్టీ కోసం పనిచేసేవారిని పార్టీ అధినాయకత్వం గుర్తించాలన్నారు. కింది స్థాయిలోనూ పార్టీ కోసం శ్రమించేవారు ఉన్నారని, అలాంటి వారికి కూడా నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని పార్టీ అధినాయకత్వానికి సయ్యద్ గౌస్ మోహీద్దీన్ విజ్ఞప్తి చేశారు.

## ఆలా శ్రీధర్‌కు జనసేనలో కీలక బాధ్యతలు

చీరాల, మేజర్ న్యూస్: నియోజకవర్గ సీనియర్ నాయకుడు అయిన ఆలా శ్రీధర్ జనసేన పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు జనసేన పార్టీ కార్యాలయం మంగళవారం అధికారికంగా ప్రకటనను విడుదల చేసింది. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు 2024 ఎన్నికల నిర్వాహణ కార్యక్రమంలో భాగంగా పవన్ కళ్యాణ్ పాల్గొనే కార్యక్రమాలు, సభలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ నిమిత్తం కమిటీలో ఆలా శ్రీధర్‌కు సముచిత స్థానం లభించింది. ఈ మేరకు జనసేన పార్టీ



కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో సెంట్రల్ ఆంధ్ర జోన్‌లో ఆలా శ్రీధర్ ఎన్నికల నిర్వాహణ కమిటీ సభ్యుడుగా నియమించబడ్డారు. ఈ సందర్భంగా ఆలా శ్రీధర్ మాట్లాడుతూ జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్‌లో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడుగా నియమించబడటం ఆనందంగా ఉందని అన్నారు. సెంట్రల్ ఆంధ్ర పరిధి లోని అనిన నియోజకవర్గాలలో పర్యటించి, రాబోయే ఎన్నికల్లో తన వంతు బాధ్యతగా నిస్వార్థంగా పనిచేసి, జనసేన పార్టీని గెలుపులో తన వంతు బాధ్యతగా పూర్తి కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన పవన్‌కళ్యాణ్‌కు, నాదెండ్ల మనోహర్‌కు, ఆలా అనిల్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నాడు.

## బి.ఎల్.ఓలకు సమీక్ష సమావేశం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రవిబాబు ఆధ్వర్యంలో బి.ఎల్.ఓ లకు సూపర్వైజర్ లకు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ



బి.ఎల్.ఓలు ఓటరు జాబితాలను పరిశీలించి మృతి చెందిన వారు, రెండు ఓట్లు నమోదైన ఓటర్లు,గ్రామాల్లో స్థిర నివాసం లేనివారు ఉంటే వారిని గుర్తించి ఫామ్ 7, ఓటు లేని కొత్త వారిని గుర్తించి ఫామ్ 6లను ఉప యోగించా లని ఆయన సూచించారు. బి.ఎల్.ఓలు పెండింగ్ క్లైయిమ్స్‌ను సకాలంలో విచారణ చేసి సంబంధించిన ఫామ్స్ సూపర్వైజర్ లకు అంద జేయాలని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వీర య్య,రీసర్వ్ డిప్యూటీ తహశీల్దార్ రాము పాల్గొన్నారు.

## 16న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

### - సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచకుండా మోసగిస్తుందని వ్యవసాయం, పరిశ్రమలు, ఘనులు, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నింటినీ అంబానీ, అదాని తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పటం చేసిందని జిల్లా సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య అన్నారు. మంగళవారం వెలిగండ్ల సెంటర్లో గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి అని పాంప్లేటు పంచటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మన రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందని, ప్రత్యేక హెూదా నిరాకరించిందని, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదని, జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తికాకుండాపరిహారం పునరావసం కల్పించలేదని, రైల్వే జోను ఎగనామం పెట్టిందని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడు సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అ మ్మకానికి పెట్టిందని, రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టిందని, కృష్ణ జలాల పంపిణీలో రాష్ట్రానికి ద్రోహం చేసిందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తుందని, అక్రమ కేసులు పెట్టించిరాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని, రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందని, మతోన్మాదాన్ని



పెంచి పోషిస్తుందని, కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక కార్మిక, వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని మద్దతు పలకకుండా బిజెపికి తొత్తుగా మిగతా పార్టీలు ఎవహ రిస్తున్నాయని, ప్రకాశం జిల్లాలో వెలుగొండ ప్రాజెక్టు నిమ్స్,త్రిబుల్ ఐటీ వెలిగండ్ల మండలంలో గన్నవరం బ్రిడ్జి తదితరవివెనకబడిపోయాయని ఇలాంటివి అమలు చేయాలని కోరుతూ రైతు, కార్మిక, ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయి. దాని సందర్భంగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా గ్రామీణ బంధు నిర్వహించాలని ఆ బందుకు రైతు సంఘాలు కార్మిక సంఘాలు, అసోసియేన్లు ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళ, సాంస్కృతిక సంఘాలు, ప్రజలు, గ్రామీణ బందును పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.

## న్యాయం కోసం వస్తే దౌర్జన్యం చేస్తారా...?

### - గిరిజన మహిళకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన

### - సీసీ ఫుటేజ్ బయటపెట్టి దాడికి పాల్పడ్డ కానిస్టేబుల్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాచవరంకు చెందిన గిరిజన మహిళ దాసరి పొట్టమ్మకు న్యాయం చేయాలని సైకో భర్తను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా సంఘ మహిళలు మంగళవారం కనిగిరి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. న్యాయం కోసం వచ్చిన ఐద్వా మహిళలపై కానిస్టేబుల్ నాగేశ్వరరావు అనుచితంగా వ్యవహరించి దాడి చేశాడని సిసి ఫుటేజ్ బయటపెట్టి అతనిపై శాఖపరమైన చర్యలు చేప ట్టాలని డిమాండ్ చేస్తూ నినా దాలు చేశారు. ఈ క్రమంలో సీఐ ఐద్వా మహిళల మధ్య



వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో పోలీసులకు ఐద్వా మహిళలకు మధ్య తోపులాట జరిగింది. పేదలంటే అంత చులకన భావమా మీకు న్యాయం కోసం అడగడానికి వస్తే దౌర్జన్యం చేస్తారా, దాడికి పాల్పడతారా అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ నాగేశ్వరరావు పై చర్యలు చేపట్టడంతో పాటు బాధిత గిరిజన మహిళకు న్యాయం చేసే వరకు కదిలేది లేదని పట్టుబట్టారు. సిఐటియు కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు, ఐద్వా కనిగిరి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే బషీర, ప్రసన్న, నాయకులు ఎలిశమ్మ, వెంకటమ్మ, ప్రమీల, చిన్నక్క, శాంతకుమారి, రత్తమ్మ, నారాయణమ్మ, తిరుపతమ్మ, విజయలక్ష్మి, రమీజాబీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

### - కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా : కొండారెడ్డి

దర్శి, మేజర్‌న్యూస్: దేశ, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అని కాంగ్రెస్ ఇంచార్జి పుట్లూరి కొండా రెడ్డి అన్నారు. శివరాజ్ నగర్‌లో మంగళవారం ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బి.జె.పి, రాష్ట్రంలోని వైకాపా హయాంలో అభివృద్ధి లేదన్నారు. ఈ ప్రభుత్వాలు



రైతులను ముంచాయని అన్నారు. మోడీ, జగన్ ప్రజలు సొమ్మును తమ బంధువులు, వారి నాయకులకు దార దాత్తం చేస్తున్నారని విమర్శించారు.

## నేడు అద్దంకిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

అద్దంకి, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లాలోని అత్యాధునిక సౌకర్యాలతో క్యాన్సర్ చికిత్స అందిస్తున్న ఒంగోలుకు చెందిన హెచ్ సి జి ఎం ఎన్ ఆర్ క్యాన్సర్ సెంటర్ మరియు అద్దంకి కి చెందిన విజయసాయి క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ బుధవారం క్యాన్సర్ వైద్య శిబిరం మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయ సాయి క్లినిక్ వైద్యులు మీరావలి తెలిపారు. అద్దంకి పట్టణంలోని భవాని సెంటర్ నుండి రేణింగవరం రోడ్డులో గల విజయసాయి క్లినిక్ నందు బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నారు రమణారెడ్డి అందుబాటులో ఉంటారని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల రెండవ బుధవారం విజయసాయి క్లినిక్ నందు ఓపి చూడబడుతుందన్నారు. పూర్తి వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి వెంకట్రావు 7416761641 నెంబర్ ను సంప్రదించగలరనీ అన్నారు.

## రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: ఫ్రధాన రహదారి మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని శాసన సభ్యుడు కరణం బలరాం కృష్ణమూర్తి సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ఈపూరుపాలెం గ్రామంలో ఉన్న ఫ్రధాన రహదారి మరమ్మత్తులకు గురి అయిన విషయం తెలుసుకున్న కరణం బలరాం అధికారులు మరియు నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు.



ఈ సందర్భంగా కరణం బలరాం అధికారులకు రోడ్డు మరమ్మత్తు విషయమై పలు సూచనలు, సలహాలు అందజేసి, మరమ్మత్తు చర్యలు తక్షణమే చేపట్టి రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిట్రా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మున్సిపల్ డీఈ పి యేసయ్య, ఆర్ అండ్‌బి డీఈ నరసింహులు, ఎస్సై శివకుమార్, తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

చీరాల, మేజర్ న్యూస్: జగన్మోహనరెడ్డి ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక చట్టం యాక్ట్ ను తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి దేవరపల్లి రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్ ఆధ్వర్యంలో భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని చేస్తున్న దీక్షకు దేవరపల్లి రంగారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దేవరపల్లి రంగారావు మాట్లా డుతూ 27/23 ఏపీ భూ హక్కుల చట్టం 2022 రద్దు చేయాలని,



భూములపై యజమాన్య హక్కులను నిర్వీర్యం చేస్తూన్నారని, రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. న్యాయ వ్యవస్థ ప్రమేయం లేకుండా న్యాయ అన్యాయాల పరిశీలన రెవిన్యూ చేతుల్లోకి మారితే సామన్యులకు భంగం వాటిల్లుతుందని, తక్షణమే ఈ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని లేని పక్షంలో న్యాయవాదుల పోరాటానికి మా మద్దతు మరియు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్లమూడి విజయ్‌కుమార్, చలపతి రావు, మస్తాన్‌రావు, సాయిబాబా, చంద్ర తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో బిఆర్ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల విజయకేతనం

కందుకూరు, మేజర్‌న్యూస్: మంగళవారం విడుదల అయిన జే.ఈ.ఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాలలో కందుకూరు బిఆర్ ఆక్స్ ఫర్డ్ ఐ.ఐ.టీ అండ్ మెడికల్ అకాడెమీ విద్యార్థులు ఎప్పటిలాగే సత్తా చాటారు. మాథ్స్ లో డిస్ట్రిక్ట్ టాప్ మార్క్స్ సాధించిన విద్యార్థులు నజీర్ బాషా (99.43) శ్యామ్ సిద్విలాస్ (97.44) అలాగే మాథ్స్ లో 90 మార్క్స్ పైన 18 మంది విద్యార్థులు సాధించారు.




**అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులు....**

శ్యామ్ శిద్విలాస్(93.28),నజీర్ బాషా(91.23),బ్రహ్మతేజ (85.75),ఆఫ్రిన్ (84.12),నేష్యాశ్రీ (83.36) ఏంజెలినా చార్లెస్ (80.20)ఉన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను,ఉపాధ్యాయులను బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల చైర్మెన్ ఉన్నం భాస్కర రావు,కరస్పాండెంట్ బి.వెంకటేశ్వర్లు,డైరెక్టర్స్ జి.బాల భాస్కర రావు, బి.నరేంద్ర బాబు,ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు,షాహుల్ హమీద్,ఇర్ఫాన్,తదితర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## ఏల్చూరులో కల్తీ పాలు తయారీ గుట్టు రట్టు

సంతమాగులూరు, మేజర్ న్యూస్ : మండలంలో నీ ఏల్చూరు గ్రామంలో అక్రమంగా తయారు చేస్తున్న కల్తీ పాలను విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు గ్రామానికి చెందిన మల్లీ రెడ్డి శామ్యూల్ రెడ్డి వద్ద 9 క్యాన్లు లలో 320 లీటర్ల కల్తీ పాలను దాడులు చేసి పట్టుకున్నట్లు ఫుడ్ ఇన్స్పెక్టర్ ప్రణీత్ కుమార్ విజిలెన్స్ సిఐ శ్రీహరి రావు స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు నిందితుని వద్ద నుండి 35 కేజీలు పామాయిల్ ప్యాకెట్లు ఎస్ ఎన్ ఎఫ్ పౌడర్ 5 కేజీలు సల్ఫర్ పట్టుకొని సీడ్ చేసి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు తరలించినట్లు అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సురేష్ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు



## దద్దాలను కలిసిన నూతన యస్ఐ ప్రేమ్ కుమార్

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: పట్టణ నూతన యస్ఐగా భాద్యతలు చేపట్టిన జి.ప్రేమ్ కుమార్ మంగళవారం కనిగిరి వైసీపి ఇంచార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కనిగిరి



దద్దాల క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో వివాదాలకు ఘర్షణలు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ యస్ఐ ప్రేమకుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ వైయం ప్రసాదరెడ్డి(బన్నీ), జడ్పీటిసిలు మడతల కస్తూరిరెడ్డి, ఓకె రెడ్డి, నాయకులు కటికాల వెంకటరత్నం తదితరులను యస్ఐ కలిశారు.

## పాలపిట్ట పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు,మేజర్‌న్యూస్: కందుకూరు ప్రాంతం యొక్క చారిత్రక రాజకీయ సాంస్కృతిక తాత్విక ఆధ్యాత్మిక వైభవాన్ని వివరిస్తూ కిషోర్ రచించిన పాలపిట్ట దీర్ఘ కావ్యం ప్రజల మన్ననలు పొందాలి అని ఎమ్మెల్యే మానుగుంట మహిధరరెడ్డి అభిలషించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలపిట్ట పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో చారిత్రక నేపథ్యాన్ని చాకచక్యంగా రచయిత తన దీర్ఘ కవిత ద్వారా చెప్పడం అభినందించదగ్గ విషయం. కావ్యం ఆవిష్కరణ అయ్యి చదవడానికి నాకు ఆసక్తి నెలకొంది అని అన్నారు. ఈనెల 24వ తేదీన, శనివారం పాలపిట్ట కావ్యం గౌరవ శాసనసభ్యులు మానుగుంట మహిధరరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరి.వసంతరావు, సూరం వేణు గోపాల్



రెడ్డి, రిటైర్డ్ రెవెన్యూ ఆఫీసర్ యం.వి.రమణ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు కొత్తూరి హరి కోటేశ్వరరావు,దమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపాసకులు గాండ్లహరిప్రసాద్ భోది, ఎఎడీ మాజీ అధ్యక్షుడు గేరాచిరంజీవి, సీనియర్ అసిస్టెంట్ చంద్రా, రచయిత ముప్పవరపు కిషోర్, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల వేతనాల జి. ఓ లను విడుదల చేయాలి

కందుకూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంపుదల చేస్తానని సమ్మె చేస్తున్న సందర్భంలో హామీ ఇవ్వడంతో సమ్మె విరమింప చేయడం జరిగిందని ఆయన ఇప్పటివరకు జీతాల పెంపుదల కు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేయకపోవడం దారుణమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రవణమ్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాల యం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమం లో పాల్గొన్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు,ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై. ఆనంద మోహన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడితే తమ సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డికి మున్సిపల్ కార్మికుల పట్ల ప్రదర్శిస్తున్న మొండి సరైనది కాదని అన్నారు. రానున్న ఎన్నికల్లో మున్సిపల్ కార్మికులు తమ ఓట్ల రూపంలో సరైన బుద్ధి చెప్పే పరిస్థితి తెచ్చుకోవద్దని వెంటనే ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో తిరిగి సమ్మెబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కు మనకు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పులి నాగేశ్వరరావు, మహేంద్ర, కత్తి మహేష్, శేషమ్మ వెంకటలక్ష్మి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల పరిశీలన

గిద్దలూరు, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్లు తదితర సౌకర్యాలను గిద్దలూరు మండల తహశీల్దార్ సిద్ధార్థ్, గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వి.శ్రీనివాసరావు కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన

కందుకూరు,మేజర్‌న్యూస్: విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంచడానికి ఉద్దేశించిన కళాజాత ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సైన్సు కళాజాత తమ ప్రదర్శనను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో



ప్రదర్శించింది. జాత కన్వీనర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శ్రీమురళీధర్ మాట్లాడుతు మారుతున్న సమాజంలో అశాస్త్రీయ ధోరణులు పెరిగిపోతున్నాయని, పర్యావరణ కాలుష్యం అధికమౌతున్నదని, సాంకేతిక విజ్ఞానం యువతను పెడదోవ పట్టిస్తున్నదని వీటికి వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక పనిచేస్తున్నదన్నారు. పిల్లలలో ప్రశ్నించే తత్వం పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణ కుమార్, విద్యా విభాగ కన్వీనర్ జి.వి.మాల్యాద్రి, పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు విప్ర నారాయణ,మహల్యారావు,జన విజ్ఞాన వేదిక నాయకులు శరత్, చిత్తారు వెంకటేశ్వర్లు,నర్సింగరావు తదితరులు పాల్గన్నారు.

## పశువులబీడు పంచాయితీ స్థలాల ఆక్రమణలు తొలగింపు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సిఎస్ పురం పంచాయితీ పరిధిలోని పశువులబీడు భూమి, పంచాయితీ స్థలాలకు సి.ఎస్.పురం రెవెన్యూ, రంగనాయునిపల్లె రెవెన్యూ, దర్శి తిమ్మక్కపల్లి రెవెన్యూ పరిధిలో కొన్ని సర్వేనెంబర్లకు సంభందించి గతంలో కొందరు గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ వేయగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇచ్చినా ఇటీవల కొందరు నాయకులు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో పశువులబీడు, పంచాయితీ స్థలాలను ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టడంతో ఇటీవల గ్రామసర్పంచ్ శ్రీరాంపద్మావతి, గ్రామస్థులు, కొందరు నాయకులు స్థానిక తహశీల్దార్ షేక్ నాగుల్ మీరాను కలిసి ప్రభుత్వ పశువులబీడు పంచాయితీ స్థలాలను కొందరు అమాయక ప్రజలను మోసంచేసి వారివద్ద డబ్బులు వసూలుచేసి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారని వెంటనే ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల మరలా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వ్యుల కాపీని జతపరచి తహశీల్దారుకు వినతిపత్రం అందజేయగా తహశీల్దార్ పరిశీలించి ఆక్రమణదారులను హెచ్చరించి ప్రొక్లయినర్లతో కట్టడాలు పాకలు తొలగించారు. కోర్టుఆదేశాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలపగా రెవెన్యూ అధికారులు పశువులబీడు పంచాయితీ ఆక్రమణలు తొలగించడంపై గ్రామస్థులు, నాయకులు అభినందనలు తెలిపారు.



## గృహసారధుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

కందుకూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని జగనన్న సచివాలయ గృహ సారథులు మృతికి చలించిన ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి మృతులైన గృహ సారథులు కుటుంబాలను అండగా ఉండి ఆదుకోవాలని ఆర్థిక సహాయంతో అండగా నిలిచారు. శ్రీనగర్ కాలనీ సచివాలయం గృహ సారథి పారాబత్తిన మాధవరావు, శ్రీరామ కాలనీ సచివాలయం గృహ సారథి కలిశెట్టి బాలకోటయ్య, కేసరి గుంట కాలనీ సచివాలయం గృహ సారథి పొట్లూరి నాగభూషణం, సంతోష నగర్ సచివాలయం గృహ సారథి షేక్ అమీర్ బాషా కుటుంబాలకు ఒక్కొక్కరికి 75,000 వేల రూపాయలు చొప్పున గృహ సారథులు కుటుంబాలకు జెసియస్ ద్వారా పంపిణీ చేశారు. ఈకార్యక్రమం లో జెసియస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, వైయస్సార్ సిపి సీనియర్ నాయకులు సూరం.వేణుగోపాల్ రెడ్డి, పాశం కొండయ్య, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, సచివాలయం కన్వీనర్లు పిడికిటి శంకర్, షేక్ బాబ్ జాన్, దేవరకొండ ఆదిలక్ష్మి, షేక్ షాహుల్ హమీద్, తలారి ప్రసన్న



కుమారి, పార్టీ నాయకులు షేక్ నాసిర్, షేక్ నయీమ్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు పెంపకం దారులకు శిక్షణ

దర్శి, మేజర్‌న్యూస్: గొర్రెలు పెంపకం దారులకు నంద్యాల జిల్లా ప్యాపిలి సహకారంతో మంగళవారం శిక్షణ నిచ్చారు. వేసవిలో యాజమాన్యం పద్ధతులు, పునరుత్పత్తిని పెంచుకోవడం, వ్యాధి నిరోధక టీకాలు, సాధారణ వ్యాధులు గురుంచి ప్యాపిలి, దర్శి పశు వర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ పురోషోత్తం రాజు, దర్శి, బోట్లపాలెం పశు వైద్యులు డాక్టర్ బసవయ్య, డాక్టర్ నాగమణి వివరించారు. ఈ కార్యక్రమంలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# బీసీలపై జగన్ రెడ్డిది కపట ప్రేమ

## – టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ



ఒంగోలు, మేజర్‌న్యూస్ : వైకాపాలో జగన్ మోహన్‌రెడ్డి ఒంటెద్దు పోకడతో బీసీ నాయకులు బయటకు వస్తున్నారని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పత్రికా ప్రకటన ద్వారా విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో బీసీ నాయకులకు మాట్లాడే స్వేచ్ఛ లేదు, ఆత్మగౌరవం అసలే లేదన్నారు. బీసీ నాయకులకు ముఖ్యమంత్రి కలిసే అర్హతే లేదు, బీసీ సమస్యల గురించి మాట్లాడే అవకాశమే లేదు. అవమానంతో ఆత్మగౌరవం లేక బీసీ నాయకులు వైసిపి నుండి బయటికి వచ్చేస్తున్నారు. 56 కార్పొరేషన్ చైర్మన్లు ఉత్సవ విగ్రహాలే, కనీసం 56పైసలు ఇచ్చే స్వేచ్ఛ కూడా లేదు. ప్రధాన పదవులన్నీ ముఖ్య మంత్రి సామాజిక వర్గం వారివే. వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి గారే ఇక్కడ బీసీలకు కనీస గౌరవ మర్యాదలు లేవు, వారి అడుగులకు మడుగులొత్తడం తప్ప అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ విప్‌గా ఉన్న జంగా కృష్ణమూర్తి ఉన్న తన సొంత నియోజకవర్గంలోనే కనీస ప్రోటోకాల్ కూడా లేక తీవ్ర పరాభవాలు. వైసీపీలో సామాజిక న్యాయం నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉందన్నారు. తెలుగుదేశంతోనే బీసీల రాజకీయ, సామాజిక సాధికారత, ఆత్మగౌరవం. కోటానుకోట్ల రూపాయలు ఎన్నికల్లో పెట్టగలిగిన బీసీలకే వైసీపీలో ప్రాధాన్యత. టిడిపిలో ప్రతి బీసీ నాయకుడికి, కార్యకర్తకు సముచిత స్వేచ్ఛ ప్రాధాన్యత ఉంది. నేరుగా చంద్రబాబు నాయుడుతో బలహీన వర్గాల సమస్యలపై మాట్లాడే స్వేచ్ఛ అవకాశం బీసీ నాయకులకు ఉందన్నారు.

# 17న చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం

## అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



బల్లికురవ, మేజర్‌న్యూస్: చంద్రబాబు రా కదలిరా సభను విజయవంతం చేయాలని అద్దంకి నియోజకవర్గం శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని యస్.ఎల్ గుడిపాడు గ్రామ తెదేపా శ్రేణులు ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్‌ను సంతమాగులూరు అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీన పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు పట్టణం నందు జరగబోయే రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పీడిత వర్గాలను ఏకం చేసే లక్ష్యంతో వారి దుశ్చర్యలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడానికి, వైసీపీ బాధిత వర్గాలు అన్నింటినీ ఏకంచేసి, తెలుగుదేశం, జనసేనపార్టీలు అధికారంలోకి వస్తే ఎటువంటి న్యాయం జరుగుతుందో తెలిపే విధంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 17న నిర్వహించదలచిన రా కదలిరా బహిరంగ సభకు ఉమ్మడి ప్రకాశంజిల్లా నలుమూలల నుంచి ప్రజలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఈ సభ ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డికి ఇదే చివరి ఛాన్స్ అనేలా శ్రేణులను సమాయత్తం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ నాలుగు సంవత్సరాల పదినెలలు పాలనలో అన్ని వర్గాలు ప్రజలు బాధితులేనని, జగన్మోహనరెడ్డి పాదయాత్రలో రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత పెరిగిన ధరలతో, వైసీపీ వేస్తున్న పనులతో రాష్ట్రంలో పేద, బలహీన వర్గాల ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని. అటువంటి భాదితుల ప్రయోజనాలు కాపాడే విధంగా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో వైసీపీ రహిత పాలన తీసుకుని రావాలనే లక్ష్యంతో ముందుకు వెళున్నారని, తెదేపా శ్రేణులంతా తరలివచ్చి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఎస్ఎన్.పాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

## జిల్లామంత్రి మేరుగ నాగార్జున అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను సత్వరం పూర్తిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి మేరుగు నాగార్జున, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ, పంచాయతీ రాజ్, అర్.డబ్ల్యూ.ఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లతో సమావేశమై నియోజక వర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి, పెండింగ్‌లో వున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడతూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన రోడ్లు, డ్రైన్స్ తదితర అభివృద్ధి పనులను సత్వరం పూర్తిచేసేలా పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో పరిష్కారం కానీ రెవెన్యూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి నాగార్జున, సంబంధిత తహసిల్దార్లను ఆదేశించారు. అర్హత వుండి ఇంటి పట్టాల కొరకు 90 రోజుల కింద ధరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్షేత్ర స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పెండింగ్లో వున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సమావేశం దృష్టికి తీసుకువచ్చిన అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి సత్వరం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, అర్.డబ్ల్యూ.ఎస శాఖల ఎస్ఈలు కొండయ్య, షేక్ మర్ధన్ ఆలీ, డిఆర్డిఎ పిడి వసుంధర, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మ నాయక్, సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని మండల తహసీల్దార్లు, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధిని మరిచిన పాలకులు

## జనసేన ప్రకాశం జిల్లా కార్యదర్శి కల్యాణ్ ముత్యాల

### సంజయ్‌గాంధీనగర్ కాలనీలో జన చైతన్య యాత్ర బృందం పర్యటన



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు నగర అభివృద్ధిని పాలకులు మరిచి పోయారని జనసేన ప్రకాశం జిల్లా కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల విమర్శించారు. దీంతో ఒంగోలులో సమస్యలు విలయతాండం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 27వ డివిజన్ పరిధిలని గాంధీ నగర్ కాలనీలో డివిజన్ అధ్యక్షులు పసుపులేటి మురళి ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర 85వ రోజు పర్యటించారు. కాలనీలో ఎదర్కొంటున్న పలు సమస్యలను జనసేన నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ముత్యాల కల్యాణ్ మాట్లాడుతూ మున్సిపల్ యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు ఆకుపాటి ఉష, గోవింద్ కోమలి, మాదాసు సాయి, 28వ డివిజన్ అధ్యక్షులు కోట సుధీర్, 9వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షులు నరసింహారావు, 15వ డివిజన్ అధ్యక్షులు మర్రిపూడి ఉదయ్, 25వ డివిజన్ ఉపాధ్యక్షులు నరేష్ చెన్ను,వీర మహిళలు అనూష, మర్రిపూడి మాధవి, జనసేన నాయకులు అవినాష్ నాయుడు, పర్చూరి పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్తు



ఒంగోలు, మేజర్‌న్యూస్: తెలుగు దేశం పార్టీతోనే నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతోందని టిడిపి నేతలు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు తిప్పరమల్లి రవితేజ, ముత్తన శ్రీనివాసరావు, బీరం అరుణ రెడ్డి, ఆర్ల వెంకటరత్నం చిరుతోటి నరసమ్మ, గోపు వీరాంజనేయులు, బోను దుర్గలు మాట్లాడారు. ఐదేళ్ళ జగన్ పాలనలో నిరుద్యోగ యువత రోడ్డున పడ్డారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానంటూ నమ్మబలికి మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత టిడిపికి అండగా నివాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమన్నారు. పేదరిక నిర్మూలన, డ్రగ్స్ నియంత్రణ, మౌళిక సదుపాయాలకు, మెరుగైన రవాణా సౌకర్యాలకు, స్కిల్ డెవలప్మెంట్‌కి, మహిళా సాధికారతకు, వ్యవసాయ వృద్ధికి, స్టార్టప్ అవకాశాల కోసం, నాణ్యమైన విద్యకు, ప్రతీ యువత ఉద్యోగానికి, ఏపీ అభివృద్ధి కోసం యువత తొలి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# ప్రకృతి వ్యవసాయం భేష్: కితాబిచ్చిన జర్మనీ బృందం



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: గ్రామములో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రభుత్వ సలహాదారు టి .విజయ కుమార్ (ఐఏఎస్ విశ్రాంత) జర్మనీ నుంచి వచ్చిన కే.ఏప్.డబ్ల్యూ అభివృద్ధి బ్యాంక్ టీం సభ్యులతో పకృతి వ్యవసాయం చేసే పొలాలను సందర్శించారు. గ్రామంలో పురిని మల్లేశ్వరమ్మ సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. అక్కడ పురిని వెంకటేశ్వర్లు రసాయనక వ్యవసాయం మద్య తేడాను గమనించారు. అదే విధంగా గ్రామంలో సాగు చేస్తున్న చామ పంటను తేడాను గమనించారు. అదే విధంగా గ్రామంలో మహిళ సంఘాలతో మీటింగ్ ఏర్పాటు చేసి మహిళ సంఘాల ద్వారా సాగుతున్న పకృతి వ్యవసాయం గురించి, ప్రకృతి వ్యవసాయంలో వారి పాత్ర గురించి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కొత్త పట్నం -6 వివోలో సామూహికంగా సాగు చేస్తున్న పకృతి వ్యవసాయాని వారు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పకృతి వ్యవసాయ సిబ్బందినీ కార్యక్రమ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని, వకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యాలయం నుంచి శ్రీనివాసురావ్, వెంకటరావ్, సత్య నారాయణ పకృతి వ్యవసాయ సిబ్బంది మహిళ సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.

# దళితుల సంక్షేమాన్ని గాలికి వదిలిన జగన్ రెడ్డి ప్రభుత్వం

సంతమాగులూరు, మేజర్ న్యూస్ : వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితుల సంక్షేమం గాలికి వదిలేసారని ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి చెందుతుందని స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు స్థానిక పుట్ట వారి పాలెం అడ్డ రోడ్డు నందు కల గొట్టిపాటి అతిథి గృహంలో. కొరిసపాడు మండలం అన మనమూరుగ్రామానికి చెందినఎస్సీ సామాజిక వర్గానికి చెందిన40 కుటుంబాలుస్థానిక అతి గృహంలో ఎమ్మెల్యే గొట్టిపాటిని కలిసితన సంఘీభావాన్ని ప్రకటించారు. రానున్న కాలంలో టిడిపి జనసేన ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామనిఈ సందర్భంగా నాయకులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో దళితుల పైన ఎస్సీల పైన దాడులు పెరిగిపోయాయనిదళితుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి విమర్శించారు దళితుల ఓట్లతో



గద్దెనెక్కిన జగన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులపై దమనకాండ పెరిగిపోయిందని జగన్ రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు మేధావులు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు జగత్ జీవనజ్యోతి పథకం కింద ఎస్సీలకు నెలకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తామని గద్దెనెక్కిన జగన్ రెడ్డి ఎడాపెడ కరెంట్ చార్జీలు పెంచిపేద ప్రజల నడ్డి విరిచారని ప్రభుత్వ చర్యలను ఆయన దుయ్యబట్టారు అంబేద్కర్ విదేశీ విద్యపథకం ద్వారా ఎస్సీలకు 20 లక్షల ఆర్థిక సాయం చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికి చెందిందని జగన్ రెడ్డి అధికారంలోనికి రాగానే విదేశీ విద్య పథకానికిఅంబేద్కర్ పేరు తీసివేసి ఆయనను అవమానపరిచారని విమర్శించారుఎస్సీలకు సంబంధించిన పలు పథకాలను తీసివేసి ఎస్సీల అభివృద్ధికి తీరని నష్టం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో. బాపట్ల పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి తేలప్రోలు రమేష్ బాబు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు

## సౌకర్యాలపై అధికారులకు నివేదిస్తాం

చీమకుర్తి, మేజర్‌న్యూస్ః ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం చీమకుర్తి సి.ఐ.ఓ.దుర్గాప్రసాదు తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సి.ఐ.దుర్గాప్రసాదు మాట్లాడుతూ మండలంలోని గాడిపర్తివారిపాలెం, గోనేపల్లివారిపాలెం, ఇలపావులూరు గ్రామాలల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రా పరిశీలిసున్నామని, ముఖ్యంగా



మౌలిక సదుపాయాలు , విద్యుత్తు సరఫరా, తాగునీటి సౌకర్యం తదితర అంశాలు ఉన్నాయా లేవా అనేది పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎక్కడెక్కడ ఎటువంటి సదుపాయాలు కల్పించాలో సంబందిత శాఖ అధికారులకు పోలీస్‌శాఖ నుంచి రాతపూర్వకంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ...భవిష్యత్ గ్యారెంటీ

పొదిలి, మేజర్‌న్యూస్ : చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావటం ద్వారానే రాష్ట్ర భవిష్యత్‌తో పాటు, ప్రజల భవిష్యత్‌కూడా బాగుంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పారు. మంగళవారం పట్టణంలోని రెండవ వార్డులో బాబు



ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టిడిపి మార్కాపురం ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విఘ్నేశ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిమానులు, మహిళలు అడుగునా హారుతులిచ్చారు. పూలదండలు, శాలువాలతో సత్కరించారు. ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. నలభై సంవత్సరాల పాటు విలువలతో కూడిన రాజకీయాలు చేసిన చంద్రబాబు నాయుడిని అక్రమంగా కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెట్టిన ఈ ప్రభుత్వం త్వరలోనే పతనం అవుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ బంద్

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: ఈ నెల 16న ఎపి రైతు సంఘము, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘము, సి.ఐ.టి.యు. బంద్‌కు పిలుపు నిచ్చాయి. కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదాని లకు కట్ట బేడుతుందని, వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన మరొక



రూపంలో కార్పొరేట్‌లకు కట్ట బెటందుకు ప్రయత్నం చేస్తునదాని దానిని నిరసిస్తూ బందుకు పిలుపు నిచ్చినట్లు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, రైతు సంఘము మండల కార్యదర్శి పంట ఏడుకొండలు తెలిపారు.

## భాస్కర్ గృహంలో విఘ్నేష్‌రెడ్డికి తేనీటీ విందు

పొదిలి,మేజర్‌న్యూస్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు గునుపూడి భాస్కర్ స్వ గృహంలో , మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి తనుయుడు విగ్నేశ్‌రెడ్డి తేనీటి విందులో పాల్గొన్నారు. అంతకు ముందుగా పట్టణంలోని పలు వార్డులలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. అనంతరం



భాస్కర్ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ టిడిపి బలోపేతం చేసేందుకు, నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ఎంత అవసరమో, మార్కాపురం నియోజకవర్గం అభివృద్ధి జరిగేందుకు, ప్రత్యేక జిల్లా కోసం, వెలుగొండ ప్రాజక్టు కోసం నారాయణరెడ్డి గెలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీలోని నాయకులు,కార్యకర్తలు తన నాయకుని గెలుపు కోసం త్రికరణ శుద్ధిగా పనిచేయాలని భాస్కర్ కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ను కలిసిన తెదేపా కౌన్సిలర్లు

అద్దంకి, మేజర్ న్యూస్: ఇటీవల జరిగిన బదిలీలలో మున్సిపల్ కమిషనర్ గా వచ్చిన అబ్దుల్ రషీద్ ను తెదేపా కౌన్సిలర్లు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని తెదేపా కౌన్సిలర్ వార్డులలో మంచినీటి సరఫరా, అభివృద్ధి పనుల విషయమై కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులకు సమ ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఏవైనా వెనుకబడిన వార్డులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి ప్రాధాన్యత కల్పించి



సమస్య పరిష్కరిస్తానన్నారు. కమిషనర్ ను కలిసిన వారిలో 4,6,11,12,14 వార్డ్ కౌన్సిలర్లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజిని, రంగశెట్టి సుభాషిని, అత్తులూరి రమేష్ బాబు, షేక్ జాహిరా, తో పాటు జడ్పిటిసి మాజీ సభ్యులు సంధి రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వార్డు మెంబర్ రంగిశెట్టి సాంబశివరావు (లహరి) ఉన్నారు.

## చీరాల ఎమ్మెల్యేను కలిసిన అద్దంకి ఆర్యవైశ్య ప్రముఖులు

అద్దంకి, మేజర్ న్యూస్: చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తిని, ఆయన కుమారుడు చీరాల వైయస్సార్సీపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ ను అద్దంకి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు మంగళవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈనెల 18వ తేదీన అద్దంకి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు జరగనున్న వైసిపి ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశానికి రావలసిందిగా ఆహ్వానాన్ని అందజేశారు. కరణం ను కలిసిన వారిలో కోట





శ్రీనివాస్ కుమార్, చిన్ని శ్రీమన్నా రాయణ, గుంటూరు మాధవరావు, ఉడత సురేష్, మద్ది లక్ష్మణ్, నల్లమల్లి సుబ్రహ్మణ్యం, కూరపాటి రామకోటేశ్వరరావు, చిలకల సుబ్బారావు, చిన్ని శివ, పలువురు ఉన్నారు.

## ఎమ్మెల్యేలకు శుభలేఖ అందించిన స్వర్ణగీత

పొదిలి,మేజర్‌న్యూస్ : మార్కాపురం ఎమ్మెల్యే కే.పి.నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబులకు, మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, ఫుడ్ కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ స్వర్ణగీత శుభలేఖలను అందించారు. తమ కుమారుడు డాక్టర్ స్వర్ణ ప్రీతమ్,డాక్టర్ హేమ రాజశ్రీల వివాహం ఈనెల 18వ తేదీన జరుగుతుందని, నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరారు.





## పోలింగ్ బూతులను పరిశీలించిన ఎస్సై

పొదిలి,మేజర్‌న్యూస్ : మండలంలోని పలు గ్రామాలలోని పోలింగ్ బూతులను ఎస్సై జి.కోటయ్య మంగళవారం పరిశీలించారు. ఈగలపాడు, పాములపాడు, గొల్లపల్లి, కుంచేపల్లి, ఉన్నగురవాయపాలెం, మల్లవరం, గ్రామాలలోని బూతులను



పరిశీలించారు. స్థానిక పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు, లేదా ఇతర సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని ఎస్సై కోటయ్య కోరారు.

## ఆటో తిరగబడి ఒకరు మృతి
### - ఆరుగురు కి తీవ్ర గాయలు

ముండ్లమూరు, మేజర్ న్యూస్ : మండలం లోని పురిమెట్ల ఉమామహేశ్వర పురం మధ్యలో కూలీల ఆటో తిరగబడి ఒకరు మృతి చెందాగా అరుగురి కి గాయలు అయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండల లోని సింగన్న పాలెం ఎస్. టి కాలనికి చెందినవాళ్ళు మిరప కాయలు కోసేందుకు ఉమామహేశ్వర పురం వెళ్లారు. తిరుగు ప్రయాణం లో ఆటో అదుపు తప్పి పడిపోయింది. ప్రైవేట్ వాహనం లో



అద్దంకి హాస్పిటల్ కు తరలించారు. అందులో ఉయ్యాల యేసు రాజు(29) కు సీరియస్ గా ఉండటం తో ఒంగోలు తీసుకు వెళుతుండగా మార్గ మధ్యలో మృతి చెందారు.మరో అరుగురి కి తీవ్ర గాయలు అయ్యాయి.

## ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర పోటీల్లో పంగులూరు టీంకు ప్రథమ బహుమతి

పంగులూరు, మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆడుదాం ఆంధ్ర" పోటీల్లో పంగులూరు గ్రామానికి చెందిన ఖో ఖో బాలుర జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. సోమవారం రాత్రి విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పంగులూరు సచివాలయం-1



జట్టు గెలుపొందినట్లు రాష్ట్ర ఖో ఖో కార్యదర్శి మేకల సీతారాం రెడ్డి తెలిపారు. ఈ జట్టు మొదట సచివాలయం స్థాయిలో, తరువాత మండల, నియోజకవర్గ, జిల్లా, స్థాయిలో ఆడి, వరుస విజయాలతో రాష్ట్రస్థాయికి చేరుకుంది. అనంతరం సోమవారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోటీలో అనకాపల్లి జిల్లా జట్టుపై విజయం సాధించి, ప్రథమ బహుమతిని సాధించింది. ఈ జట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయలు నగదు బహుమతి అందుకొనున్నట్లు, సీతారాం రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో విజయం సాధించి బహుమతి గెలుచుకున్న పంగులూరు సచివాలయం -1 బాలుర ఖో ఖో జట్టు ను పంగులూరు గ్రామ ప్రజలు, పలువురు పెద్దలు అభినందిస్తున్నారు.

# స్థాయిమరచి అశోక్ బాబు మాట్లాడటం తగదు



వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: నియోజకవర్గానికి కొత్తగా ఎక్కడి నుంచో వచ్చిన వైసిపి ఇన్ చా ర్జి బాధ్యతలు చేపట్టిన వరికూటి అశోక్ బాబు తన స్థాయిని మరచి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పై విమర్శలు చేయడం సహేతుకం కాదని వేమూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జొన్నలగడ్డ విజయ బాబు,వేమూరు మండల పార్టీ అధ్యక్షుడు దండే సుబ్బారావు,రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి కిషోర్ లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అశోక్ బాబు ను ఎక్కడి నుంచో దిగుమతి చేసుకుంటే వచ్చిన మనిషి అన్నారు.గతంలో మీరు చేసిన ఉద్యోగం,రియల్ ఎస్టేట్ ద్వారా రైతులను మోసగించి, ముంచిన విషయాలు ప్రజలకు తెలియనివి కాదన్నారు.అటువం టి మీరు అధికారులను అడ్డం పెట్టుకుని నియోజ కవర్గంలో ఇల్లు అద్దెకు తీసుకుని, ఆధార్ కార్డు పుట్టిం చుకున్నంత మాత్రాన మీరు, స్థానికుడవు కావని,ప్రజ లు అర్థం చేసుకుంటు న్నారన్నారు.రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఎక్కడినుంచి వచ్చావో అక్కడికి తిప్పి పంపడం ఖాయమని వారు హెచ్చరించారు.మీ పార్టీ మీకు అవకాశం ఇచ్చింది,పోటీ చేసి ప్రజల అభిమానం సంపాదించాలి గా నీ,ఏదో మాట్లాడి ప్రజలకు దగ్గరౌదా మనుకోవడం పిచ్చి ప్రేలాపనలేనని హెచ్చరించారు. నియోజకవర్గంలో మీ పార్టీ ఎమ్మెల్యే కి,మీకు పొసగడం లేదని,వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయి వైసీపీలోనే ఒక వర్గం వ్యతిరేకిస్తున్నారని ప్రజలకు తెలిసిన విషయమేనని వారన్నారు.ఆ విషయాన్ని కప్పించుకోవటానికే,ఆనంద బాబు పై ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని,అది మీరు గ్రహించుకోవాలన్నారు.సమావేశంలో టిడిపి నాయ కులు షేక్ హనీఫ్,వేల్పుల రవి వరప్రసాద్, దోప్పలపూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికై అర్బన్ సీఐ సోమయ్య స్పెషల్ డ్రైవ్



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని కుమ్మరామకట్ట సెంటర్, రైల్వే స్టేషన్, వైఎస్ఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై గిద్దలూరు పియస్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమయ్య తన సిబ్బందితో కలిసి పట్టణంలో పర్యటించి రోడ్డుపై వాహనాలు నిలపరాదని హెచ్చరించారు. వ్యాపార సంస్థల ఎదుట ట్రాఫిక్ సమస్య సృష్టించేలాగా వాహనాలను నిలపరాదని అన్నారు.పోలీసుల సూచనల ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని అన్నారు.

## జగన్ రెడ్డి మోసపు మాటలు నమ్మి మోసపోవద్దు



రేపల్లె, మేజర్‌న్యూస్: అధికారం కోసం జగన్ రెడ్డి మోసపు మాటలతో సిద్ధ పడ్డారు ప్రజలు గమనించాలని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. మంగళవారం స్థాని పట్టణం 2వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు కు గ్యారంటీ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారం కోసం ఎన్నైనా అబద్ధాలు ఆడటానికి సిద్ధంగా ఉన్నారని మరోసారి ప్రజలు మోసపోవద్దని కోరారు జగన్ రెడ్డి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అంధకారం నెట్టడమే కాకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు గోగినేని పట్టాభి రామారావు, తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు ఆలూరి సురేష్, ఆలూరి దానియేలు, పరిశా పవన్ కళ్యాణ్ దేవగిరి రవిశంకర్, తెలుగుదేశం - జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే అనగాని ఆర్థిక సాయం



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: స్థానిక లక్ష్మీ వ్యూవర్స్ కాలనీకి చెందిన బొట్టు సుబ్బారావు మనవడు బట్టు చైతన్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం గ్రామ టిడిపి నాయకుల ద్వారా తెలుసుకున్న రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్ ఆయన సొంత నిధుల నుండి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి టౌన్ టిడిపి అధ్యక్షులు నాగుల పున్నారావు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు, రేపల్లె పొలిటికల్ మేనేజర్ పి కుమార్ స్వామి, ఎం ఆర్ కె మూర్తి, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా చెరుకుపల్లి మండలం రాంబొట్లపాలెం గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి సభ్యుడు పిట్టు శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ సిఫార్సు మేరకు మంగళవారం తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాజీ జెడ్పిటిసి సభ్యుడు శ్రీనివాస రెడ్డిని ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.తన నియామకానికి కృషి చేసిన టిడిపి బాపట్ల జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు,రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ లకు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని శ్రీనివాస రెడ్డి తెలిపారు. బాపట్ల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస రెడ్డి నియామకం పట్ల మండల టిడిపి అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, దివి రాంబాబు, పూషడపు కుమారస్వామి, ఎం ఆర్ కే మూర్తి, చెరుకుపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు నాగుల పున్నారావు, పార్టీ నాయకులు వి. శ్రీనివాసరావు కందుల వెంకటేశ్వరరావు దివి శ్రీనివాసరావు పేరం శంకర్ గౌడ్, వీరంకి వెంకట శివ, కందుల వెంకటేశ్వరరావు, కాటూరి శ్రీహరి లచ్చి రామారావు దాసరి శ్రీనివాసరావు సొంటి కోటయ్య వేము సోమయ్య అక్కల రామసుబ్బారెడ్డి, దాసరి శ్రీనివాసరావు, లచ్చి రామారావు, దుర్గాప్రసాద్, తదితరులు హర్షం తెలిపారు.

# రాష్ట్రస్థాయిలో నిజాంపట్నం మండల మహిళల టీం గెలుపు



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నిజాంపట్నం మండల పరిషత్ అధ్యక్షులు మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబు అన్నారు మంగళవారం నిజాంపట్నం మండలం గ్రామ సచివాలయం మూడు పరిధిలో గల క్రీడాకారిణులు వాలీబాల్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొంది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతి తీసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. గ్రామస్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహించడం క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించినట్లు అవుతుందని తద్వారా రాష్ట్రస్థాయి దేశస్థాయిలో పోటీలలో నిలిచి గ్రామాల పేర్లను రాష్ట్రస్థాయిలో దేశ స్థాయిలో మారు మోగిస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్, డీసీఎంఎస్ చైర్పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ప్రసాదం వాసుదేవ, ది మొగధారమ్మ తల్లి ఫిషింగ్ మేకనైజ్డ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోపిదేవి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కట్టా తిరుపతమ్మ, పంచాయతీ పాలక మండల సభ్యులు కూచినపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ బసవ పున్నయ్య, మండల పరిధిలో సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు గెలుపొందిన టీము కు అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే రఘుపతిని సన్మానించిన అయ్యప్ప రెడ్డి



కర్లపాలెం ,మేజర్ న్యూస్.కర్లపాలెం మండల పరిధిలోని ఏట్రవారి పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మునగాల అయ్యప్ప రెడ్డిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కమిటీలో కార్యదర్శిగా అధిష్టానం ఇటీవల నియమించింది. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతిని అయ్యప్ప రెడ్డి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డితో కలిసి గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆట్ల నాగేశ్వర రెడ్డి, ఆట్ల పెద శ్రీనివాస్ రెడ్డి, ఏట్ర ప్రసాద్ రెడ్డి, ఆట్ల హరిబాబు రెడ్డి, జయభారత్ రెడ్డి, అంకినీడు సంతోష్, ఏట్రవారిపాలెం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జంకేకు అభినందనలు



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఒంగోలు వైఎస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు, మార్కాపురం మాజీ శాసనసభ్యులు ఏపీఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డిని వైఎస్ఆర్సిపి డాక్టర్స్ భాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## గణపతి స్వామివారి కల్యాణోత్సవం



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి గణపతి స్వామి వారి వార్షిక బ్రహ్మో త్సవాల లో భాగంగా మంళవారం ఉదయం స్వామివారికి 11సార్లు మహ న్యాస పూర్వక రుద్రాభిషేకం, అనం తరం అన్నాభిషేకం నిర్వహించారు.రాత్రి 9 గంటలకు వేద పండితులు కౌతా రాజేష్ శర్మ,ఆలయ ధర్మకర్తలు తాడికొండ శేషగిరిరావు,కుటుంబ సభ్యులచే సిద్ధి బుద్ధి సమేత శ్రీ సిద్ధి గణపతి స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆల య ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామ చంద్రమూర్తి,తమిరిష మారుతి, సత్యసాయి,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రత్తి వెంకట సుబ్బారావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ ప్రధాన కార్యదర్శిగా గుర్తింపు

వేటపాలెం, మేజర్‌న్యూస్: అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, ఫౌండర్, అంతర్జాతీయ అధ్యక్షులు గుడివాడ వేణు గోపాల్ సోమవారం వేటపాలెం గ్రామం విచ్చేసి ఆర్య వైశ్య మహా సభ మాజీ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రత్తి వెంకట సుబ్బారావుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించి, నియామక పత్రము అంద చేశారు. ఈ సందర్భంగా వేటపాలెం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కోటిస్వామి గుప్త, కార్యదర్శి మజేటి వెంకట సుబ్బారావు, వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు వుటుకూరి నాగ శ్రీనివాసరావు, శ్రీ రామ సేవా సంఘం అధ్యక్షులు కొత్త శ్రీనివాస గుప్త, విరూపాక్ష యువజన సంఘం మాజీ కార్యదర్శి పేర్ల సుమన్, దోగుపర్తి వెంకట సుబ్బారావు, ప్రత్తి శరత్ బాబు, సాతులూరి వీర శేఖర్, తిరువీధుల మురళీ కృష్ణ, సికాకొల్లి ప్రకాష్, పాదర్తి రామ చంద్ర రావు తదితర ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొని, సుబ్బారావుని అభినందించారు. తదుపరి వేణు గోపాల్‌ని వీరు సాధారంగా సత్కరించారు.ఈ సందర్భంగా వేణు గోపాల్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని విజయవాడలో, పొట్టి శ్రీరాముల 58రోజుల నిరహార దీక్షకు, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన కృషికి గుర్తుగా 58అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు, భారత ప్రభుత్వం ద్వారా భారతరత్న అవార్డు అందచేయాలని,



గన్నవరం విమానాశ్రయం పేరును అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని అందుకు అందరి సహకారం కావాలని కోరినట్లు తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని పందిళ్లపల్లి ప్రాంతంలో అక్రమంగా ఇసుక త్రవ్వకాలు తరచూ జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మూడు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్న సమయంలో వేటపాలెం ఎస్ఐ జీ.సురేష్ వేటపాలెం బైపాస్ రోడ్డులో గస్తీ విధులలో ఉండగా ఈ ట్రాక్టర్లు వస్తున్నట్లు డ్రైవర్లను అనుమతి పత్రాలు చూపమనడంతో లేవని చెప్పడం జరిగింది. వెంటనే ఆ మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## జిల్లా ఎస్పీని కలిసిన సిఐ వెంకటేశ్వర్లు



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా జిల్లా ఎస్పీగా పనిచేసిన మల్లికా గర్గను తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేయగా ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వరరెడ్డిని, మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## మల్లిఖార్జునను పరామర్శించిన గరికపాటి



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు విరాయ్య పాలెంకు చెందిన గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మందడి మల్లికార్జునను దర్శి జనసేన నాయకులు గరికపాటి వెంకట్ పరామర్శించారు. అనారోగ్యంతో ఒంగోలులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూన్నాడు. ఆయనను మంగళవారం గరికపాటి పరామర్శించారు. త్వరగా కోలుకొని ఇంటికి రావాలని కోరారు.

## బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో 30 యాక్ట్ అమలు: డి.ఎస్.పి టి. వెంకటేశులు



బాపట్ల మేజర్ న్యూస్ బాపట్ల పట్టణం డీఎస్పీ ఆఫీస్ నందు నిర్వహించిన పత్రిక సమావేశంలో డి.ఎస్.పి టి వెంకటేశులు మాట్లాడుతూ బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్ల పరిధి లోని ప్రజలందరికీ రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 30 & 30(ఏ) పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు మొదలైనవి నిర్వహించడం నిషేధించడమైనది. కావున ఎవరైనా రాజకీయ పార్టీలవారు కానీ, మరేదైనా సంఘాలవారు కానీ సభలు, సమావేశాలు జరుపుకొనుటకు ముందుగా పోలీసు వారి అనుమతి పొందవలేను. ఆ విధంగా అనుమతి తీసుకోకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు మొదలైనవి నిర్వహించిన పోలీసు వారు తీసుకొను చట్ట పరమైన చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

## నేడు మండలంలో 'జగనన్నకి చెబుదాం'

బల్లికురవ, మేజర్‌న్యూస్: నేడు బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మధ్యాహ్నం 3 గంటలకు బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వారి సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

# మన ఊరు-మన తెలుగుదేశంలో జయంత్ బాబు

మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంత్ బాబు ఆధ్వర్యంలో మన ఊరు-మన తెలుగుదేశం కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో గార్లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులతో, కార్యకర్తలతో జయంత్ బాబు మాట్లాడటం జరిగింది. రాబోవు ఎన్నికల్లోమన పార్టీకి పడే ప్రతి ఓటును పోల్ చేయించవల్సిన ఆవశ్యకతను వివరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎస్సీ, బిసి కార్పొరేషన్‌లని నిర్వేర్యం చేసి మోసం చేసింది, కాలనీల్లో ఇచ్చు 200 యూనిట్లు విద్యుత్ పథకాన్ని మోసపూరితంగా వ్యవహరిస్తున్నది. తెలుగుదేశం ప్రభుత్వంలో 200 యూనిట్లు దాటి విద్యుత్ వాడితే ఎక్కువ వాడిన యూనిట్‌లకి మాత్రం బిల్ కట్టవలసి వచ్చేది. తెలుగుదేశం ప్రభుత్వం లో మొదటి నెల 200 కంటే తక్కువ యూనిట్‌లు వాడి, రెండవ నెల 200 యూనిట్ లు కంటే ఎక్కువ వాడుకున్న, మొదటి నెల మిగిలిన యూనిట్‌లను రెండవ నెల లో కలిపి బిల్ లేకుండా చేశారు. ఈ ప్రభుత్వంలో ఏ నెల యూనిట్లు వాడుకోవాలి, తక్కువ వాడుకున్నా తరువాత నెలకి కలుపరు, మిగిలిన యూనిట్‌లు మురిగిపోతాయి. 200 యూనిట్‌ల కంటే ఎక్కువ వాడుకుంటే 1యూనిట్ నుండి చివరి యూనిట్ వరకు బిల్ కట్టాలి. ఈ మోసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు



మొనపాటి వెంకటసుబ్బయ్య, సీతారాంపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మండ గోపిచందు, గడియపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల శ్రీను, తెలుగు యువత కార్యదర్శి కోటు వెంకటేష్, దాసరి హరికృష్ణ, మాజీ సర్పంచ్ చిన మస్తాన్, తాళ్ళూరి మధు, కోటు కోటయ్య, కె.ఆనంద్, మొనపాటి రామకృష్ణ, గ్రామస్థులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# ట్రై సైకిల్ పంపిణీ చేసిన అమీర్ బాబు

పామూరు, మేజర్‌న్యూస్: నడవడానికి కాలి లేక వికలాంగురాలితో ఇబ్బంది పడుతున్న కోడిగుంపల గ్రామానికి చెందిన పరుచూరి సుధారాణికి టిడిపి జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు ట్రై సైకిల్ అందజేశారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో అమీర్ బాబు ట్రై సైకిళ్లను పంపిణీ చేసిన విషయం విధితమే. జన్మదినం సందర్భంగా వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ చేశారన్న సమాచారం తెలుసుకున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు అమీర్ బాబును సంప్రదించారు. మంగళవారం కోడిగుంపల గ్రామంలోని పరచూరు సుధారాణి నివాసానికి వెళ్లి ట్రై సైకిల్



అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోలక తిరుపతిరెడ్డి, కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ పి.మాల్యాద్రి, పి.మాల్యాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాలిచర్లలో ఎస్‌బిఐ కళాజాత

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిమ్మారెడ్డిపల్లి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత ఎంవి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత వారు వాలిచర్ల పెద గొల్లపల్లి నారాయపల్లి హనుమంతునిపాడు గ్రామాలలో కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు బ్యాంకు పథకాలపై బ్యాంక్ స్కీమ్స్‌పై ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన అటల్ పెన్షన్ యోజన ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ సైబర్ మోసాల గురించి నగదు రహిత లావాదేవీల గురించి జీరో అకౌంట్ బ్యాంకులో పొందే ఋణ సౌకర్యాల గురించి మాటల ద్వారా పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు అర్థమైన



టువంటి రూపకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంకు బ్యాంకు మేనేజర్ పిఎం జగదీష్, క్యాష్ ఇంచార్జ్ మొగల్ కరీం బాషా, సయ్యద్ చాంద్‌బాషా, హనుమంతుని పాడు బిజినెస్ కరస్పాండెంట్ హరి ప్రసాద్, వెలుగు ఆఫీస్ సిసి శీను, ఈవో బ్యూలా, కళాజాత బృందం సభ్యులు విజయ్, సింగర్ వినోద్, మెజీషియన్ చిరంజీవి, డప్పు ప్లేయర్, పొదుపు మహిళా సంఘాలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆలిండియా జెఇఇ మెయిన్స్‌లో శ్రీ ప్రతిభ విద్యార్థులు ప్రభంజనం

ఒంగోలు, మేజర్‌న్యూస్: మంగళవారం విడుదలైన జెఇఇ మొయిన్స్ - 2024 పరీక్షా ఫలితాలలో ప్రతిభ విద్యార్థులు రాణించారు. మ్యాథ్స్ 98.38, 98. 25, 97 పర్సంటైల్ పైన 8 మంది, 96 పర్సంటైల్ పైన 12 మంది, కెమిస్ట్రీలో 97.79, 97.10లతో పాటు, ఫిజిక్స్ 96.18, అన్ని సబ్జెక్టో పుట్లూరి గోపవర్ధన్ 96.47, రావి మహేశ్ చౌదరి 95.739, గట్టమనేని మోహితా సాయి 95.50, తోట వెంకట అవినాష్ నాయుడు 92.75, గుండారెడ్డి ప్రయాంక 92.27, నందికంటి వెంకట తరుణ్ క్రిష్ణ 92.27 సాధించినారని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లుగారు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన



కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సి.ఇ.ఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## మాల మహానాడు యూత్ అధ్యక్షులను సన్మానించిన గరికపాటి

దర్శి, మేజర్‌న్యూస్: కుల మాత బేధాలు లేకుండా టిడిపి, జనసేన అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని దర్శి నియోజ కవర్గం జనసేన నాయకులు కోరారు. నియోజకవర్గం మాలమ హానాడు అధ్యక్షులు డోలా కరుణాకర్, యూత్ అధ్యక్షులు పులి కిషోర్, బిసి సెల్ అధ్యక్షులు సత్యనారాయణ మంగళవారం గరికపాటి వెంకట్‌ను కలిశారు. యూత్ అధ్యక్షులుగా ఎన్నిక అయిన కిషోర్‌ను గరికపాటి వెంకట్ సన్మానించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కటకానపల్లి గ్రామానికి చెందిన భువనగిరి పద్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో యర్రగొండపాలెం వైసిపి ఇన్చార్జి తాడిపర్తి చంద్రశేఖర్ అందజేశారు. పెద్దారవీడు మండలంలో ఏర్పాటు చేసినటువంటి ఆసరా కార్యక్రమం నందు భువనగిరి పద్మ బంధువులకు 62 వేల రూపాయలచెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావిక్రింది రామారావు, వెన్నా వెంకటేశ్వర్ రెడ్డి, పొందుగల వెంకట రెడ్డి, కిక్కురు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: ఉభయ రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘంల ఆధ్వర్యంలో 16వ తేదీ గ్రామీణ భారత బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చాయి. ఈ సమావేశానికి రైతు సంఘం నాయకులు అందే నాసరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్నటువంటి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం వారు అనుసరిస్తున్న విధానాలు వారు చేపట్టినటు వంటి దుర్మార్గపు పద్ధతులను తిప్పి కొట్టడానికి 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్, పారిశ్రా మిక సమ్మె జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## సీతమ్మను పరామర్శించిన గరికపాటి

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి మాజీ ఎమెల్యే దిరిశాల రాజ గోపాల్ రెడ్డి సతీమణి సీతమ్మ ను దర్శి జన సేన నాయకులు గరికపాటి వెంకట్ పరామర్శించారు. మధుమేహ వ్యాధితో ఆసుపత్రిలో చేరిన దర్శి మాజీ ఎమ్మెల్యే దిరిసాల రాజగోపాల రెడ్డి భార్య దిరిసాల సీతమ్మను పరామర్శించారు. గరిక పాటి వెంకట్ దర్శి జనసేన నాయకు డు దిరిసాల యేసు రెడ్డిని కలుసుకుని తల్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

## అమృత్ సరోవర్‌కు నేడు భూమి పూజ

బల్లికురవ, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ముక్తేశ్వరం గ్రామపంచా యతీ పరిధిలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో (అమృత్ సరోవర్) నీటి నిల్వ కోసం ఒక ఎకరా భూమినీ కేటాయించారు.ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు 27 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఈ నీటి నిల్వ కుంటకు మధ్యాహ్నం 2 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు ఎంపీడీవో హనుమరెడ్డి, ఏపీవో బాలకృష్ణ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ భూమి పూజకి బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పానెం హనిమిరెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలిపారు.

## చెన్నకేశవులు పొగాకు బ్యారన్ దగ్ధం

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ముప్పళ్ళ పాడు గ్రామానికి చెందిన కొటికల చెన్నకేశవులు పొగాకు బ్యారన్ సోమవారం ఉదయం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో బ్యారన్లో ఉన్న పొగాకు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు కనిగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

## రథసప్తమి వేడుకలకు ఇమ్మడి కాశీనాథ్‌కు ఆహ్వానం

మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: జిల్లా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ కార్యాలయం నందు మంగళవారం దేవస్థానం కమిటీ సభ్యులు కలిసి ఈ నెల 16వ తేదీన జరగబోయే శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి రథసప్తమి మహోత్సవానికి హాజరుకావాలని జన సేన పార్టీ మార్కాపురం నియోజ కవర్గ ఇంఛార్జ్ ఇమ్మడి కాశీనాధ్‌ని ఆహ్వానించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారి దేవస్థానం సేవా సంఘం అధ్యక్షులు కాశీ విశ్వనాధం, సభ్యులు కోరారు.